తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 23.05.2027 | సంపుటి :12 సంచిక : 303 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



## 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ(జనంసాక్షి): జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 20 కల్లా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఏపీ నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహి స్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 4. 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల 26న ముగియనుంది. దీంతో నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

## కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో నిమ్స్

# అరుదైన ఘనత




### 2 వేల కిడ్నీ మార్పిడులతో రికార్డు

సౌత్‌ఇండియాలోనే నం.1 ఇనిస్టిట్యూట్

వైద్య బృందాన్ని అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):నిమ్స్ హాస్పిటల్ మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. దేశంలో 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ప్రభుత్వ హాస్పిట్‌ల్‌గా రికార్డు సృష్టించింది. 1989లో నిమ్స్‌లో తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, తాజాగా 2000ల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్టు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ అచీవ్‌మెంట్‌ను సాధించగలిగామని బీరప్ప తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిమ్స్‌కు సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ

మిగతా 2లో..

### నేడు యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి రేవంత్

2లో..

## కొందరికి పదేపదే రిజర్వేషన్లు



### ఇలా అయితే మరి మిగతా వారి సంగతేంటి?

- వారు కూడా ఆ ఫలాలు పొందాలి కదా
- ఇలా అయితే దేశం రిజర్వేషన్ల నుంచి బయటపడేనా?
- ఐఏఎస్ తల్లిదండ్రుల పిల్లలకూ రిజర్వేషన్లు అవసరమా?
- సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయో జనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించిం ది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని

మిగతా 2లో..

### త్రిభాషా విధానంతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి

- ఇంత ఆదరాబాదరాగా అమలు చేస్తే విద్యాపరంగానూ వారు ఇబ్బందులు పడతారు
- నూతన విద్యా విధానంపై సుప్రీంలో సవాల్

2లో..



## నిప్పుల కుంపటిలా తెలంగాణ

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

వడదెబ్బతో భూపాలపల్లిలో నలుగురు మృతి

వరంగల్(జనంసాక్షి):తెలంగాణలో ఎండలు రోజురోజుకీ మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పులకొలిమిలా మారింది. భూపాలపల్లిలో వడదెబ్బతో ఒక్క రోజే నలుగురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. రేగొండ మండలం భాగిర్తిపేటకు చెందిన యాకూబ్(45), మొగుళ్లపల్లి మండలం పోతుగల్లుకు చెందిన సక్కమ్మ(59), చిట్యాల మండలం చల్లగరిగేకు చెందిన పోషయ్య, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన సమ్మక్క(65) వడదెబ్బ బారినపడి ప్రాణాలు కోల్పోయారు.

మిగతా 2లో..

### కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన

ముంబయి(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాం క్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి

మిగతా 2లో..

## పోలీసులు గాలిస్తుంటే 9 రోజులు బండి భగీరథ్‌కు

# ఆశ్రయం ఎవరిచ్చారు?

- నేరస్తుడికి ఆశ్రయం ఇవ్వడం నేరమే కదా!
- ఈ వ్యవహారంలో బండి సంజయ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారు
- 2034 వరకు తానే సీఎం అంటున్న రేవంత్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవ్వాలి
- మీడియా సమావేశంలో కేటీఆర్ డిమాండ్




హైదరాబాద్ (జనంసాక్షి):పోక్సో కేసు విషయంలో బండి భగీరథ్‌ను కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రి అంటున్న రేవంత్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. తాము కూడా రాజీనామా చేస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ధాన్యం కొనుగోళ్లు, బండి భగరథ్ కేసు సహా వివిధ అంశాలపై కేటీఆర్ మాట్లాడారు. "రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని రైతులే కాదు.. కాంగ్రెస్ కార్యకర్తలు

మిగతా 2లో..

### నా బాధ్యతలు పూర్తి చేశాను

విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు రావాలనే లక్ష్యంతో రేవంత్

మిగతా 2లో..



## హైదరాబాద్‌కు టెస్లా

నగరంలో ఇవి కార్ల షోరూం • మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్(జనంసాక్షి):ఇవి వాహనాల దిగ్గజ సంస్థ టెస్లా త్వరలో హైదారాబాద్‌లో విక్రయ, సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. శుక్రవారం నాడు ఆ సంస్థ ఇండియా ప్రతినిధులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయిన సందర్భంగా తాము ఇక్కడ అమ్మకాలు ప్రారంభించేందుకు ఆసక్తితో ఉన్నటు వెల్లడించారు. విద్యుత్తు వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకో సిస్టంను తెలంగాణాలో అభివృద్ధి చేసినట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. సెమీ కండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్ వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా రాష్ట్రం ఎదిగిందని చెప్పారు. హైదరాబాద్ లో టెస్లా విద్యుత్తు వాహనాల సేల్స్, సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, లీడ్ పబ్లిక్ పాలసీ, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్ లను శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. టెస్లా ఇప్పటి వరకు దేశంలో నాలుగు

మిగతా 2లో..




### పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'

- డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ రాష్ట్రం
- ఇన్నోవేషన్స్,టాలెంట్,ఎకనామిక్ గ్రోత్‌ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'
- డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

వార్త 2 లో

### మేం అధికారంలోకొచ్చాక ఫ్యూచర్‌సిటీ రద్దు చేస్తాం

ఆ పేరుతో కాంగ్రెస్ సర్కార్ రియల్ వ్యాపారం

మాజీమంత్రి హరీశ్ రావు విమర్శలు

హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి

మిగతా 2లో..

### తెలంగాణలో తొలి గ్లాస్ బ్రిడ్జి


రాష్ట్రంలో తొలి గాజు వంతెన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో సిద్ధమవుతోంది. కాకతీయుల కాలం నాటి స్థానిక ఎల్లమ్మ చెరువు సుందరీకరణలో భాగంగా 5 అడుగుల వెడల్పు, 150 మీటర్ల పొడవుతో హృదయాకారంలో దీన్ని రూపొందిస్తున్నారు. రూ.4.22 కోట్లతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జిని మరో నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అధికారులు పేర్కొన్నారు. తొలి గ్లాస్ బ్రిడ్జి కావడంతో పనులు పూర్తి కాకముందే చూడటానికి ప్రజలు విచ్చేస్తున్నారు.



## అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టండి

లీకేజీలను అరికట్టి, బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి

క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ఆర్థిక పురోగతిని పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బ్జడెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన 'రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ కీలక భేటీకి కమిటీ సభ్యులైన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో కలిసి లోతుగా సమీక్షించింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించనున్న బ్జడెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి

మిగతా 2లో..

### ఖరీఫ్‌లో యూరియాకు కటకటే..



- కేటాయింపుల్లో కోత పెట్టిన కేంద్రం
- వానాకాలం సీజన్‌లో పంటలు, కూరగాయల సాగుపై ప్రభావం
- వెంటనే 2లక్షల టన్నుల విడుదల చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్(జనంసాక్షి):కేంద్రం కేటాయింపుల మేరకు యూరియా విడుదల చేయకపోవడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో తగినంత లేకపోవడంతో వానాకాలం పంటల సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఏడాది వర్షాకాలం సీజన్? కోసం రూ. 11.50 లక్షల టన్నుల యూరియా అవసరమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయితే అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, ఉత్పత్తి తగినంత జరగకపోవడం, ఇతర పరిణామాల కారణంగా కేంద్ర ప్రభుత్వం 10 లక్షల టన్నులకే అనుమతించింది. అయితే ఏప్రిల్? నెలలో 2 లక్షల టన్నుల యూరియా సరఫరా కావాల్సి

మిగతా 2లో..

### ఎవరెస్ట్ పర్వాతారోహణలో విషాదం

కిందకు వస్తున్న క్రమంలో ఇద్దరు భారతీయుల మృతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎవరెస్ట్ పర్వత శిఖరంపై విషాదం చోటుసేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని కిందకు దిగివస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ అధికారులు ప్రకటించారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ అరేగా గుర్తించారు. ఎవరెస్ట్ శిఖరం దిగుతుండగా సందీప్ అరే తీవ్రంగా

మిగతా 2లో..

### ఉమర్ ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్



9లో..

## కొందకి పదేపదే రిజర్వేషన్లు

పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## త్రిభాషా విధానంతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి

**ఇంత ఆదరాబాదరాగా అమలు చేస్తే విద్యాపరంగానూ వారు ఇబ్బందులు పడతారు**

**నూతన విద్యా విధానంపై సుప్రీంలో సవాల్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (ఔఇఖ) సిఫార్సుల మేరకు సీబీఎస్ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ,9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను అందులో రెండు భారతీయ భాషలను చదవాలనే నిబంధనను తీసుకు వచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, కోర్సుల మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఈ విచారణపై దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

## మేం అధికారంలోకొచ్చాక ఫ్యూచర్‌సిటీ రద్దు చేస్తాం

ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీకేజీలో కొనసాగుతున్న అరెస్టుల పర్వం

**తాజాగా లాతూర్‌కు చెందిన డాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న సీబీఐ**

ముంబయి(జనంసాక్షి):లీకైన నీట్ గెస్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఒక డాక్టర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకున్నది. ఆయన ఆసుపత్రిలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి నీట్ గెస్ పేపర్ లీక్ చేయడంపై ప్రశ్నిస్తున్నది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ మనోజ్ శిరూరేకు ఇప్పటికే అరెస్టయిన ఎన్టీఏ కమిటీలో సభ్యుడైన పూణెళికు చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ మోటెగావ్‌కర్‌తో పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో తన మేనల్లుడు, మేనకోడలు కోసం నీట్ గెస్ పేపర్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. దీంతో గురువారం లాతూర్‌లో డాక్టర్ మనోజ్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పూణెళిలోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీకి తీసుకెళ్లి ఆయన అరెస్ట్‌ను ప్రకటించనున్నారు. కాగా, నీట్ పరీక్షకు కొన్ని రోజుల ముందు డాక్టర్ మనోజ్‌కు చెందిన లాతూర్‌లోని ఆసుపత్రిలో పీవీ కులకర్ణి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ కుమారుడు కూడా ఈ క్లాస్‌లకు హాజరైనట్లు పేర్కొంది. ఈ ఆసుపత్రిలోనే నీట్ గెస్ పేర్ లీకైనట్లు సీబీఐ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో శివరాజ్ కుమారుడు, డాక్టర్ మనోజ్ మేనకోడలు, మేనల్లుడిని కూడా సీబీఐ అధికారులు విడివిడిగా ప్రశ్నించారు. మరోవైపు నీట్ పరీక్షకు ముందు కుమార్తె కోసం లీకైన ప్రశ్నాపత్రాన్ని రూ. 5 లక్షలకు కొనుగోలు చేసినట్లు భావురావు కదమ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాందేడ్‌లోని ఆ నివాసంపై సీబీఐ రైడ్ చేసింది. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన సోదాల్లో కీలక పత్రాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. భావురావు కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం పుణెలోని తమ కార్యాలయానికి రావాలని భావురావు, ఆయన కుటుంబ సభ్యులను సీబీఐ ఆదేశించింది.అయితే మే 3న నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించగా పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఆ పరీక్షను ఎన్టీఏ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లో పూణె, లాతూర్, నాందేడ్ వ్యక్తుల మధ్య సంబంధాలను సీబీఐ పరిశీలిస్తున్నది. నీట్ లీక్ పేపర్‌ను ఎంత మంది తల్లిదండ్రులు , ఎంతెంతకు కొనుగోలు చేశారు అన్నది దర్యాప్తు చేస్తున్నది.

## కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో నిమ్స్ అరుదైన ఘనత

మంత్రి దామో దర్ రాజనర్సింహాకి బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు 2000 మంది కిడ్నీ రోగు లకు నూతన జీవితం ప్రసాదించిన నిమ్స్.. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలిచింది. కిడ్నీ మార్పిడి శస్త్రచి కిత్సల్లో దాదాపు 95 శాతం మంది రోగులు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా చికిత్స పొందినట్లు బీరప్ప వెల్ల డించారు. శస్త్రచికిత్స మాత్రమే కాకుండా, అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ యూరాలజీ విభాగం హెడ్, డాక్టర్ రాహుల్ రాజ్‌ను బీరప్ప అభినందించారు. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలోనే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ఎ÷-లాంట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను యూరాలజీ టీమ్ విజయవంతంగా నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే నిర్వహించడం విశేషం.నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ అరుదైన ఘనతపై ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ మళ్లీ మళ్లీ నిరూపిస్తోందన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించి, పేదలకు ఉచితంగా అత్యాధునిక, ఖరీదైన వైద్య సేవలు అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఇటీవల గాంధీ హాస్పిటల్‌లో 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు అత్యాధునిక వసతులతో కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అలాగే, సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్‌లో కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకొస్తు న్నామని మంత్రి వెల్లడించారు. దీంతో ప్రభుత్వ రంగంలోనే అత్యాధునిక అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తా యన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడి చికిత్సలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడిలో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95? మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడిలు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

## పోలీసులు గాలిస్తుంటే 9 రోజులు బండి భగీరథ్‌కు ఆశ్రయం ఎవరిచ్చారు?

కూడా ధర్నాలు చేస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనూ రైతులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో 35 శాతానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. ఏ విషయంలోనూ ప్రభుత్వానికి ప్రణాళిక లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు దాదాపు 10 మంది ఉన్నారు. 45 డిగ్రీల ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశమే ప్రధాన అజెండాగా ఉండాలి. ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. పోక్సో కేసులో నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలి. సామాన్యుడైతే పోలీసులు ఊరుకుంటారా? నిందితుడిని నిందితుడిగానే చూడాలి" అని కేటీఆర్ అన్నారు. కాగా జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. త్వరలో రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఓటర్ల ఓట్ల జాబితా సవరణ కోసం ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న జాతీతీ కార్యక్రమానికి సంబంధించిన విషయంలో లక్షలాది మంది తెలంగాణ ఎన్ఆర్ఐల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నదని అన్నారు.

## నా బాధ్యతలు పూర్తి చేశాను

నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. విద్యా సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన తొలి విద్యా కమిషన్ చైర్మనే ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంతో, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నూతన విద్యా చట్టాల రూపకల్పన ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి ధీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల చుట్టూ ముసిరిన రాజకీయ జగడం, ఉపాధ్యాయ లోకం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత ఒత్తిళ్ల వల్లే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

## కేంద్రానికి ఆర్‌బీఐ శుభవార్త

రూ. 2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించను న్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లి స్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వం లో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమిషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది.

## ఎవరెస్ట్ పర్వాతారోహణలో విషాదం



అలసిపోయారని, ఆయనను కాపాడేందుకు గైడ్స్ ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేక పోయారని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ సెక్రటరీ జనరల్ రిషి భండారి తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలోనే మరో పర్వతారోకుడు అరుణ్ తివారీ కూడా ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ హిల్లరీ స్టెప్ వద్ద తీవ్రంగా అలసిపోవడంతో నలుగురు గైడ్స్ ఆయనకు సాయం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. క్యాంప్-2 వద్ద ఆయన కన్నుమూసినట్టు వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని గత బుధవారంనాడు విజయవంతంగా 274 మంది అధిరోహించారు. ఒకేరోజు అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్ అధిరోహించిన బృందంగా కూడా వీరు రికార్డు నెలకొల్పారు. ఇందులో సందీప్ అరే కూడా అన్నారు. అయితే పర్వతం నుంచి కిందకు దిగుతుండగా సందీప్ అరే మృతిచెందగా, గురవారంనాడు మరో బృందం ఎవరెస్ట్ శిఖరం చేరుకుంది. అందులో అరుణ్ తివారీ ఉన్నారు. పర్వతం దిగివస్తుండగా ఆయన మృతి చెందారు

## నిప్పుల కుంపటిలా తెలంగాణ

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 22 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొమ్మిది మంది వడదెబ్బ బారినపడి మరణించడం ఆందోళన కలిగిస్తోంది. భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. తీవ్రమైన ఎండలతో చిన్నపిల్లలు, వృద్ధులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

## పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రెహెన్సివ్ రోడ్ మ్యాప్'



- **డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ**
- **ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్ ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'**
- **డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్(జనంసాక్షి):డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దిఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్̈ ÷నాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదా య పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ-డ్జి÷న్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం̈ ÷నాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్ కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్ ? ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు టెస్లా

సేల్స్ షోరూంలను ఏర్పాటు చేయగా తదుపరి కేంద్రంగా హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు. టెస్లా కేవలం ఇవి కార్ల కంపెనీ మాత్రమే కాదని, ఎలక్ట్రిక్ వాహనాల సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీలు, అధునాతన తయారీ రంగాల్లో నూతన ఆవిష్కరణలను పరిచయం చేసిన సంస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. టెస్లా దీర్ఘకాలిక సాంకేతిక లక్ష్యాలకు తెలంగాణలో ఉన్న ఎకోసిస్టం బాగా సరిపోతుందని ఆయన తెలిపారు.

## అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టండి

అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా నిర్దేశిరచుకున్న టైమ్ లైన్ ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. అనివార్య కారణాలవల్ల ఈ సమావేశానికి రానటువంటి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను అధికారులను ఆదేశించారు . రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు.. మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశం లో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన 'హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్' సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ , పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశర చేసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రెవిన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌లో యూరియాకు కటకటే..

ఉన్నప్పటికీ 1.53 లక్షల టన్నులు, మేలో 2 లక్షల టన్నులకుగాను 48,985 టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయింది. దీంతో ఈ పరిస్థితి తలెత్తింది.

యూరియా యాప్ సేవలు నిలిపివేత : కేంద్రప్రభుత్వం నుంచి సరఫరా తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం యూరియా యాప్ సేవలను నిలిపివేసింది. దీంతో సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 1.46 లక్షల టన్నుల యూరియాతోపాటు సుమారు 10 వేల టన్నుల డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే యాప్‌ను పునఃప్రారంభిం చినట్లయితే ఒకే రోజు మొత్తం స్టాక్ ఖాళీ అవుతుందని అధికారులు అంచనావేస్తున్నారు.ఏప్రిల్ నెలాఖరు నుంచి రైతులకు యూరియా ఎరువు అందుబాటులో లేకపోవడం సమస్యాత్మకంగా మారింది. రాష్ట్రంలో 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేశారు. వాటికి యూరియా అవసరం. మరోవైపు గత ఏడాది వేసిన 79 వేల ఎకరాల ఆయిల్‌పామ్ మొక్కల ఎదుగుదలకూ యూరియా అవసరం పడుతుంది. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ముందస్తు వరి సాగు చేసే అన్నదాతలు నార్లు పోశారు. వాటికీ ఎరువులు అవసరమే. రైతులు యూరియా కోసం రోజూ దుకాణాలు, డీలర్ల వద్దకు వెళ్తున్నప్పటికీ యాప్ నిలిచిపోయిందని వారు చేతులెత్తేస్తున్నారు.

**2 లక్షల టన్నుల ఎరువులు విడుదల చేయాలి :**
మరో వారం రోజులు యూరియా అందకపోయినట్లయితే నారు ఎండిపోతుందని కూరగాయలు, ఆయిల్‌పామ్ మొక్కల ఎదుగుదల ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అన్నదాతలు యూరియా కోసం మహారాష్ట్రకు వెళ్తుండగా అక్కడ అధిక ధరలు చెప్పడంతో పాటు ఇతర ఎరువులను వారికి అంటగడుతున్నారు. వెంటనే రెండు లక్షల టన్నుల ఎరువులు విడుదల చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినప్పటికీ స్పందన రాలేదు.

**పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో ఎరువుల కొరత**
పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా ఇంధన సంక్షోభంతో పాటు ఎరువులపై కూడా ప్రభావం చూపుతోంది. వ్యవసాయ రంగానికి అత్యంత ముఖ్యమైన యూరియా సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారత్ వినియోగించే యూరియాలో దాదాపు 46 శాతం ఒమన్ దేశం నుంచే దిగుమతి అవుతుంది.

# జీహెచ్ఎంసీ పరిధిలోని.. ప్రతి వార్డుకు భారత రాజ్యాంగం!

- 300 వార్డులలో ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
- కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షులు మహేశ్వర్ రాజు




హైదరాబాద్ (జనం సాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్రతి మున్సిపల్ వార్డులో భారత రాజ్యాంగం ప్రతులను ఉచితంగా పంపిణీ చేస్తామని 'కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్' రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. మహేశ్వర్ రాజు, కె.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఓ హోటల్ లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు వారిరువురు ప్రకటించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డులలోను భారత రాజ్యాంగం ప్రతులను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి వార్డులోను ఐదు రాజ్యాంగ ప్రతులను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రాజు, కె.రామకృష్ణ మాట్లాడుతూ కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ సంస్థ "సేవ్ కానిస్టిట్యూషన్ - సేవ్ ఇండియా" నినాదంతో "గ్రామ గ్రామం - రాజ్యాంగం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం చదివాలనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గత సంవత్సరం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు, సామాజిక యాక్టివిస్టుల సమక్షంలో 'గ్రామ గ్రామం రాజ్యాంగం' కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి గ్రామం (సుమారు15 వేల గ్రామాలు)లతో పాటు మున్సిపాలిటీలలో, నగరాలతో పాటు హైదరాబాద్ మెట్రో నగరంలోని ప్రజలకు ఉచితంగా భారత రాజ్యాంగం ప్రతులను అందించడం తో పాటు భారత రాజ్యాంగంను ప్రతి ఒక్కరు అవగతం చేసుకునేలా తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తమ ఆర్గనైజేషన్ చేపట్టిన పవిత్రమైన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ను కూడా ఆశిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ ఎంతో శ్రమించి తన జీవితాన్ని త్యాగం చేసి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగాన్ని కానుకగా అందించారన్నారు. భారత రాజ్యాంగ విలువలు భారత పౌరుల హక్కులను ప్రజలకు తెలియడానికి గ్రామ గ్రామం భారత రాజ్యాంగం కార్యక్రమంను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రొ.జి.మల్లేషం, తారిక్ మునీర్, ఎం. గంగాధర్, కోల జనార్దన్, గడ్డం జాన్సీ, షాహనా ఖాన్, పీవీ రమణ, ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి
- జిల్లా అభివృద్ధి లో అందరూ భాగస్వాములు కావాలి
- జూన్ 2వ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు
- ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, మే 22(జనంసాక్షి) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని, జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు చేస్తామని, ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయబోతున్నమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా స్థాయి సమావేశాన్ని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని తెలిపారు. 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలు పూర్తి చేసుకొని నేడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, జిల్లా స్థాయి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మే 18 నుండి 23 వరకు జరుగుతున్న "యువత మరియు క్రీడలు" వారోత్సవాలు స్ఫూర్తితో యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, పథకాల అమలు చేస్తున్న తీరును వివరించారు. ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడి యట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తామని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరిస్తామని, దివ్యాంగ ఇంటర్ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పంట వైవిధ్యీకరణ, సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. అధికారు లు ప్రజలతో సన్నిహితంగా మమేకమైతు పారదర్శకతతో పథకాలను అమలు చేయాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రామచంద్రపూర్ గ్రామ శివారులోని 10 వేల ఎకరాల పై చిలుకు భూములకు రీ సర్వే నిర్వహించమన్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఆలయ అభివృద్ధి కోసం 22 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఆలయ పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ములుగు నియోజకవర్గానికి అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని, ములుగు జిల్లాలో నూతనంగా 38వేల పైచిలుకు పెన్షన్లను జూన్ రెండవ తేదీన అందించనున్నట్లు తెలిపారు. పథకాల అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు లేవని ధాన్యం తరలించడానికి లారీలు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ములుగు జిల్లా స్థానిక యువతి యువకులను నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని 80 నుంచి సుమారు 100 ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బహుళ జాతి కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండే విధంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు గ్రామాల సర్పంచ్ లు గ్రామ అభివృద్ధికి కట్టుబడి కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను, కష్టాలను, కన్నీళ్లను తుడవడమే లక్ష్యంగా పనిచేయాల న్నారు. గ్రామాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడడం కోసం పారిశుధ్య కార్మికులను సక్రమంగా ఉపయోగించుకో వాలన్నారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

# సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర**



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా జరిగే జనాభా లెక్కలలో బీసీల జనాభా లెక్కలను సేకరించడాన్ని సుప్రీంకోర్టు సమర్ధించడం శుభ పరిణామమని, అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర అన్నారు సుప్రీంకోర్టు తీర్పుతో నైనా కేంద్ర ప్రభుత్వం బాధ్యతతో బీసీ కులగనన ప్రక్రియను ప్రారంభించాలని అన్నారు. స్వాతంత్రానికి పూర్వం బ్రిటిష్ ప్రభుత్వంలో మాత్రమే కులగణన చేశారని స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు కులగనున చేయకపోవడం దౌర్భాగ్యమని అన్నారు. దేశంలో మొదటి నేషనల్ బీసీ కమిషన్ కాకా ఖాలేల్కర్ రిపోర్టులో స్పష్టంగా దేశంలో కులగణన జరగాలని 1952-53 లో రిపోర్ట్ ఇస్తే పాలకులు ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. దేశంలో రెండవ నేషనల్ బీసీ కమిషన్ బీపీ మండల్ రిపోర్టులో కూడా కులగణన చేయాలని రిపోర్టు ఇచ్చిన నేటి వరకు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన వెంటనే దేశంలో కులగనన చేయాలని కెసిఆర్ నాయకత్వంలో అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారని, బీసీలకు చట్టసభలలో 33% రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ తీర్మానం చేసిందని, నాడు కేంద్ర ప్రభుత్వానికి పంపిన కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కానీ నేడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయబద్ధమైనదని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాబోయే కాలంలో తప్పకుండా బీసీల జనగణను చేసి విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయంగా వారి జనాభా తమాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపుల్లో వారి తమాషా ప్రకారం కేటాయించాలని బీసీల అభివృద్ధి కోసం తగిన పాలసీలు తయారు చేయటానికి ఈ కులగనన ఎంతగానో ఉపయోగపడు తుందని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఈ దేశ ప్రధాని ఇంతవరకు నోరు విప్పలేదని ఢిల్లీలో జరగబోయే క్యాబినెట్ సమావేశంలో బీసీ కులగణనపై సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల బాధలు అర్థం చేసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత త్రిసభ్య ధర్మాసనానికి దేశ ఓబీసీల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఢిల్లీ వేదికగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన అన్నారు.

# ఐసీఐసీఐ లొంబార్డ్ నుంచి కొనసాగుతున్న 'సర్వీస్ అష్యూర్'

- 30 నిమిషాల్లో రోడ్‌సైడ్ సహాయం అందించే వినూత్న హామీ

**ముంబై, మే 22 (జనంసాక్షి) :** భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల్లో ఒకటైన ఐసిఐసిఐ లొంబార్డ్ తన 'ఐఎల్ స్మార్ట్ అసిస్ట్' (రోడ్‌సైడ్ అసిస్టెన్స్) సేవలో భాగంగా 'సర్వీస్ అష్యూర్' అనే కొత్త హామీ సేవను ప్రారంభించినట్లు ప్రకటించింది. పరిశ్రమలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన రోడ్‌సైడ్ సహాయ హామీలలో ఒకటైన ఈ 'సర్వీస్ అష్యూర్' సేవ కింద, వాహనం మార్గమధ్యంలో నిలిచిపోవడం లేదా ప్రమాదానికి గురికావడం జరిగినప్పుడు, ఎనిమిది మెట్రో నగరాల్లోని ప్రైవేట్ కార్ కస్టమర్ల వద్దకు 30 నిమిషాల్లో చేరుకుంటామని సంస్థ హామీ ఇస్తోంది. ఈ ప్రారంభం సంస్థ 25 సంవత్సరాల మైలురాయిని పురస్కరించుకుని చేపట్టబడింది. మోటార్ బీమాను కేవలం 'క్లెయిమ్ సేవ' విభాగం నుంచి 'సేవా హామీ' విభాగంగా మార్చే దిశగా సంస్థ చేపట్టిన ప్రయాణంలో ఇది తదుపరి ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. 'సర్వీస్ అష్యూర్' సేవ ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, పూణె మరియు అహ్మదాబాద్ నగరాల్లో అందుబాటులో ఉంది. వాహనం మార్గమధ్యంలో నిలిచిపోవడం అనేది కార్ యజమాని ఎదుర్కొనే అత్యంత ఒత్తిడిగల పరిస్థితుల్లో ఒకటి. ముఖ్యంగా సహాయం నిజంగా ఎప్పుడు చేరుకుంటుందో తెలియని అనిశ్చితి ఆ పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తుంది. భారతదేశంలో రోడ్‌సైడ్ సహాయ సేవలు ఎన్నో సంవత్సరాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, సేవలు చేరుకునే సమయంపై కస్టమర్లకు స్పష్టమైన హామీలు సాధారణంగా ఇవ్వబడలేదు. అయితే, 'సర్వీస్ అష్యూర్' ఈ విధానాన్ని మార్చుతోంది. కస్టమర్ అనుభవంలో భాగంగా, స్పష్టమైన, కొలవగలిగే, కస్టమర్‌కు ప్రత్యక్షంగా అర్థమయ్యే సమయ హామీని కేంద్రంగా ఉంచి ఈ సేవను రూపొందించింది.

కస్టమర్ వాహనం మార్గమధ్యంలో నిలిచిపోవడం లేదా ప్రమాదానికి గురికావడం జరిగితే, వారు కేవలం ఐసిఐసిఐ లొంబార్డ్ టోల్-ఫ్రీ నంబర్ 1800 2666కు కాల్ చేస్తే సరిపోతుంది. అనంతరం సంస్థ పాలసీని ధృవీకరించి, వాట్సాప్ ద్వారా కస్టమర్ ఖచ్చితమైన స్థానాన్ని నిర్ధారిస్తుంది. అవసరమైతే శిక్షణ పొందిన టెక్నీషియన్‌ను లేదా టోయింగ్ ట్రక్కును నియమిస్తుంది. ఆ సమయంలో కస్టమర్‌కు టెక్నీషియన్ లేదా డ్రైవర్ వివరాలు పంపించబడతాయి మరియు అప్పుడే 30 నిమిషాల 'సర్వీస్ అష్యూరెన్స్' సమయ గడువు ప్రారంభమవుతుంది. ఒకవేళ హామీ ఇచ్చిన సమయానికి సేవ ఆలస్యమైతే, కస్టమర్‌కు ధృవీకరణ కాల్‌తో పాటు ముందుగా నిర్వచించిన ప్రత్యేక సేవా ప్రయోజనాలు అందించబడతాయి. వీటిలో క్లెయిమ్స్ నిపుణుడి నుంచి వ్యక్తిగత సహాయం, వాహనం నిలిచిపోవడానికి గల కారణాన్ని గుర్తించేందుకు వాహన తనిఖీ, కస్టమర్ అత్యవసర సహాయ సేవలు, అలాగే ఫస్ట్-ఎయిడ్ కిట్‌ను తిరిగి నింపే సదుపాయం కూడా ఉంటాయి. ఈ ప్రారంభంపై స్పందిస్తూ ఐసిఐసిఐ లొంబార్డ్ చీఫ్ కమర్షియల్ లైన్స్, మోటార్ (అండర్‌రైటింగ్, క్లెయిమ్స్) విభాగాధిపతి గౌరవ్ అరోరా మాట్లాడుతూ "ఒకటిన్నర సంవత్సరం క్రితం 'స్మార్ట్ సేవర్ ప్లస్' ద్వారా, కస్టమర్ల కార్ల మరమ్మతులకు మేము తీసుకునే సమయంపై ఒక హామీ ఇచ్చాం. ఇప్పుడు 'సర్వీస్ అష్యూర్' ద్వారా, అవసరమైన సమయంలో కస్టమర్ల వద్దకు ఎంత వేగంగా చేరుకుంటామనే విషయంపై మరో హామీ ఇస్తున్నాము. ప్రతి అడుగుతో, మోటార్ బీమా అనేది కేవలం ఎంత మొత్తాన్ని చెల్లిస్తుందనే దానితో కాకుండా, ఎంత వేగంగా, ఎంత నమ్మకంగా సేవలను అందిస్తుందనే దానితో కూడా కొలవబడాలి అనే సరళమైన ఆలోచనకు మరింత దగ్గరవుతున్నాం" అని తెలిపారు. గ్లోబల్ అష్యూర్ (సర్వీస్ అష్యూర్‌కు సేవలందించే సంస్థ) వ్యవస్థాపకులు మనీష్ విజ్ మాట్లాడుతూ వాహనం మార్గమధ్యలో నిలిచిపోతే, డ్రైవర్లు గంటల తరబడి ఆందోళనతో, అనిశ్చితిలో, సహాయం కోసం అంతులేని నిరీక్షణలో చిక్కుకుపోతారు. గ్లోబల్ అష్యూర్ లో, రోడ్డుపై ఇరుక్కుపోయినప్పుడు ప్రతి నిమిషం ఎంత ముఖ్యమో మాకు బాగా తెలుసు. అందుకే దేశంలోని అగ్ర 8 నగరాల్లోని ఐసిఐసిఐ లొంబార్డ్ కస్టమర్లకు మా '30 నిమిషాల సర్వీస్ హామీ' సేవను అందించేందుకు వారితో భాగస్వామ్యం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఐసిఐసిఐ లొంబార్డ్ విశ్వసనీయ బీమా రక్షణను, మా వేగవంతమైన రోడ్‌సైడ్ సహాయం మరియు రియల్-టైమ్ ట్రాకింగ్ సేవలతో కలిపి, కస్టమర్లకు సంపూర్ణ మనశ్శాంతిని అందించడంతో పాటు, రోడ్డుపై కలిగే ఆందోళనను వేగవంతమైన, నమ్మకమైన సహాయంగా మలుస్తున్నాం" అని తెలిపారు.



# సీఎం ప్రజావాణిలో 396 దరఖాస్తులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 224వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 396 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 163, రెవెన్యూ శాఖకు సంబంధించి 47, ఇందిరమ్మ ఇండ్ల కోసం 113, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 72 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సి.పి. ఉమేందర్, ఎన్ఆర్ఐ సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో కార్మికుడు ఫిర్యాదు

- అక్రమంగా బంధిస్తున్నారంటూ కార్మిక కుటుంబాల ఆవేదన
- ఘటనా స్థలానికి నేరుగా వెళ్లి న్యాయం చేసిన ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్




**ములుగు బ్యూరో, మే22 (జనం సాక్షి):** ములుగు జిల్లా బండారుపల్లి గ్రామం ఇటుక బట్టీల తయారీ వద్ద గత కొంత కాలంగా పనిచేస్తున్న కార్మికులు తమ యజమాని వేడిస్తున్నారంటు సోషల్ మీడియా ద్వారా అందిన ఫిర్యాదుపై ములుగు జిల్లా ఎస్పి కేకాన్ సుదీర్ రామ్‌నాథ్ వెంటనే స్పందించి, సంబంధిత ఇటుక బట్టీ పని ప్రదేశానికి స్వయంగా చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. బండారుపల్లె ప్రాంతంలోని కేఎంకే బ్రిక్స్ వద్ద పనిచేస్తున్న కార్మికులు, తమ కుటుంబాలను అక్రమంగా నిర్బంధించి తమ సొంత రాష్ట్రానికి వెళ్ళనీయకుండా చేస్తున్నాడనే ఫిర్యాదు అందగా, అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ఎస్పీ అక్కడి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఇటుక బట్టీల యజమానితో మాట్లాడగా వారికీ ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని వారిని వారి సొంత రాష్ట్రానికి వెళ్లేలా వాహనాన్ని సైతం పెట్టానని ఎస్పి కి విన్నవించాడు. కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తమ స్వగ్రామా లకు సురక్షితంగా వెళ్లేందుకు ఎస్పి పూర్తి భరోసా కల్పించారు.ఎస్పీ తో ములుగు డీఎస్పి నలువాల రవీందర్, ములుగు ఎస్ఐ ఉపేందర్ కలిసి పాల్గొన్నారు.

# పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పంట కొనుగోళ్ళ సంక్షోభం తీవ్రంగా ఉన్నదని, దీన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులంతా అవాస్తవాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్నదాతల పరిస్థితి పైన, పంట కొనుగోళ్ళ సంక్షోభం పైన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా చేసిన పంట కొనుగోళ్ళ పైన, పంటల వారీగా ఒక శ్వేతపత్రం... లెక్కలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో స్వయంగా పర్యటించిన తాను, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న రైతన్నల దుస్థితిని చూసిన తర్వాత ప్రభుత్వానికి బుధవారం ఒక బహిరంగ లేఖ రాస్తే... ముఖ్యమంత్రితో పాటు మంత్రి అబద్దాలు, అటెన్షన్ డైవర్షన్ ముచ్చట్లు చెప్పారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం రేపు జరిగే క్యాబినెట్ సమావేశంలోనైనా అత్యంత కీలకమైన ఈ పంట కొనుగోళ్ళ సంక్షోభం పైన చర్చించాలని, రైతన్నల కష్టాలే ఏకైక ఎజెండాగా రేపటి క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు అన్నదాతల ఆత్మహత్యల పైన, మరణాల పైన ప్రభుత్వానికి సమాచారం ఇస్తే... సివిల్ సప్లైస్ మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా 'ఎవరూ చనిపోలేదు' అని బుకాయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైతే పంట కొనుగోళ్ళు ఆలస్యమై, నష్టపోయిన రైతన్నలు మరణాల పాలయ్యారని, వారి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వచ్ఛందంగా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని, ధర్నాలు చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఆరుగాలం పండించి తీసుకువచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకి తరలిస్తే... కనీసం వాటిని కాంటా పెట్టడం లేదు. కాంటా పెట్టిన సందర్భంలోనూ భారీగా తరుగు తీసి దోపిడీకి గురి చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ నియోజకవర్గంలో కూడా రైతన్నలు పంట కొనుగోళ్ళ అంశంలో నిరసన తెలిపిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే గన్నీ బ్యాగుల నుంచి మొదలుకొని సుతలి దారం వరకు ప్రతి అంశంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని కేటీఆర్ అన్నారు. ఎక్కడైనా ముఖ్యమంత్రి చెప్పినట్లు 80 శాతం కొనుగోళ్ళు పూర్తయ్యాయని నిరూపిస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమని ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాలు విసిరారు. ఇప్పటికైనా పంతాలకు పోకుండా రైతన్నల కోసం అండగా నిలబడాలని కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పంట కొనుగోళ్ళ అంశం పైన స్పందించి, తగిన చర్యలు తీసుకోకుంటే... రైతన్నలకు సమస్యలను పట్టించుకోకుంటే, పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ హెచ్చరించారు.



**పుష్కరాలు ప్రారంభమైనా కొనసాగుతున్న సుందరీకరణ పనులు**

**కాళేశ్వరం, మే 22 (జనంసాక్షి) :** కాళేశ్వరంలో ఈనెల 21న ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నప్పటికీ, పుష్కరాలకు సంబంధించి చేపట్టిన పలు అభివృద్ధి, సుందరీకరణ పనులు ఇంకా పూర్తికాకపోవడం భక్తులను నిరాశకు గురిచేస్తోంది. పుష్కరాలు ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తి చేయాల్సి ఉండగా, రెండు రోజులైనా కొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయ సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పశుపతి గార్డెన్ సుందరీకరణ పనులు ఇంకా కొనసాగుతుండటం గమనార్హం. పనుల కోసం నిర్మాణ సామగ్రి, యంత్రాలు అక్కడక్కడ కనిపిస్తుండటంతో భక్తులకు అసౌకర్యం కలుగుతోంది. పుష్కరాల వంటి మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని భక్తులు మండిపడుతున్నారు. కోట్లాది రూపాయల నిధులతో నిర్వహిస్తున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో ప్రాథమిక పనులే పూర్తికాకపోవడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పుష్కరాల నిర్వహణపై అధికారులకు చిత్తశుద్ధి లేదని, పనుల్లో సమన్వయం లోపించిందని విమర్శిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

- కలెక్టరేట్ ముందు రైతుల ధర్నా

**మెదక్, మే22 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట హవేలి ఘనపూర్ మండలంలోని కొత్తపల్లి రైతులు ధర్నా చేపట్టారు. దీంతో మెదక్ -ఎల్కతుర్తి జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ గ్రామంలో 80 లారీల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని, ప్రస్తుతం 20 లారీల ధాన్యం బస్తాలు మాత్రమే తరలించినట్లు వారు తెలిపారు. ఇంకా 60 లారీల ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేసి తరలిస్తారని రైతులు వాపోయారు. అనంతరం అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మెదక్ గ్రామీణ, హవేలి ఘనపూర్ మండలం ఎస్సైలు లింగం, సత్యనారాయణ, హవేలి ఘనపూర్ తహసీల్దార్ సింధురేణుక అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పడంతో వారు ధర్నా విరమించారు.

# తెలంగాణలో ఎస్‌ఐఆర్ భీతి

సంపాదకీయం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓటర్ల జాబితా ఎల్లప్పుడూ సున్నితమైన అంశంగానే ఉంది. కానీ ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరిట జరుగుతున్న ప్రక్రియ తెలంగాణలో తీవ్రమైన ఆందోళనలకు తావిస్తోంది. బెంగాల్‌లో జరిగిన అనుభవాలు కళ్ళముందు కదులుతుండగా, తెలంగాణ ప్రజలు నిజంగానే తల పట్టుకుంటున్నారు.

అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియను 2002 నాటి మ్యాప్‌తో అనుసంధానించడం. తెలంగాణ 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. అంటే ఇప్పటికి రెండు దశాబ్దాల కిందటి భౌగోళిక సరిహద్దులు, నియోజకవర్గ విభజనలు నేటి వాస్తవాలకు ఏమాత్రం అనుగుణంగా ఉండవు. హైదరాబాద్ మహానగరం విస్తరించింది. కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. లక్షలాది మంది నివాస స్థానాలు మారాయి. ఈ నేపథ్యంలో 2002 మ్యాప్‌ను ఆధారంగా చేసుకుని ఓటర్ల సమాచారాన్ని సరిపోల్చడం అంటే చాలామంది చట్టబద్ధమైన ఓటర్లు "అర్హులు కారు" అనే ముద్ర వేయబడే ప్రమాదముంది. ముఖ్యంగా పట్టణ వలస కార్మికులు, అద్దె ఇళ్ళలో నివసించే వారు, మహిళలు వీరందరికీ ఈ ప్రమాదం మరింత ఎక్కువగా పొంచి ఉంది.

**పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియలో వేలాది మంది ఓటర్లు జాబితా నుండి తొలగింపునకు గురయ్యారు. మైనారిటీ వర్గాలకు చెందిన ఓటర్లు అసమానంగా ప్రభావితమయ్యారు. అక్కడ చోటు చేసుకున్నది కేవలం పరిపాలనా పొరపాటు కాదు, రాజకీయ లక్ష్యంతో కూడిన ఓట్ల తాలూగింపుగా ప్రతిపక్షాలు, పౌర సమాజం ఆరోపించాయి. తెలంగాణలోని సామాజిక కార్యకర్తలు, రాజకీయ విశ్లేషకులు ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఓటు హక్కు పోగొట్టుకోవడం అంటే పేదలకు, వెనుకబడిన వర్గాలకు తమ ప్రాతినిధ్యాన్నే పోగొట్టుకోవడం.**

ఇక్కడ మరో విచిత్రమైన పరిస్థితి ఉంది. బూత్ లెవెల్ ఆఫీసర్స్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే. వారు రాష్ట్ర పరిపాలనా వ్యవస్థకు జవాబుదారీగా ఉంటారు. కానీ ఓటర్ల జాబితా సవరణ అధికారం ఎన్నికల సంఘం ద్వారా కేంద్రానికి చెందుతుంది. బిఎల్ఓలపై రాష్ట్ర రాజకీయ ఒత్తిళ్ళు, కేంద్ర నిర్దేశాలకు రాష్ట్ర సహకారం సమస్యాత్మకంగా మారడం, స్థానిక స్థాయిలో జరిగే లోపాలకు బాధ్యత నిర్ధారణ అసాధ్యంగా మారడం, ఓటరు వివరాల తనిఖీలో పారదర్శకత లోపించడం.. ఉద్యోగి రాష్ట్రానికి చెందినా, అతను నిర్వర్తిం చే విధి కేంద్ర వ్యవస్థ పరిధిలో ఉందంటే – జవాబుదారీతనం గాల్లో కలిసిపోతుంది.

నేరుగా ఓట్లు కొనడం పాత పద్ధతి. ఇప్పుడు సరికొత్త తిరకాసు పుట్టుకొచ్చింది. ఓటరునే జాబితా నుండి తొలగించడం. ఒక నిర్దిష్ట వర్గం ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి పేర్లను తొలగిస్తే, ఆ నియోజకవర్గంలో ఓట్ల సమీకరణ సమూలంగా మారిపోతుంది. ఇది ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా కాదు, నిశ్శబ్దంగా హత్య చేయడం. దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాలు అధికంగా ఉన్న నియోజకవర్గాలు, పట్టణ పేద వాడలలో నివసించే వలస కార్మికులు, వివాహం తర్వాత పేరు మారిన మహిళలు.. వీరందరి పేర్లు "సరిపోలలేదు" అనే కారణంతో తొలగించబడే అవకాశం ఉంది.

ప్రజాస్వామ్యం కాపాడాలంటే.. ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక హక్కు. దాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు, ఎన్నికల సంఘానికి, పౌర సమాజానికి ఉంది.

ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, బహిరంగంగా జరగాలి. 2002 మ్యాప్ వంటి అసంబద్ధమైన ప్రమాణాలను తక్షణం తొలగించాలి. బిఎల్ఓల జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్వచించాలి. ముఖ్యంగా బెంగాల్‌లో జరిగిన పొరపాట్లు తెలంగాణలో పునరా వృతం కాకుండా చూసుకోవాలి. ప్రజాస్వామ్యం బ్యాలెట్ బాక్సులో మాత్రమే ఉండదు. ఓటర్ల జాబితాలో కూడా ఉంటుంది. ఆ జాబితాను శుద్ధి చేసే పేరుతో ప్రజాస్వామ్యాన్నే శుద్ధి చేయడం జరగకూడదు.

# మారుతున్న సమాజం - క్షీణిస్తున్న మావోయిస్టు రాజకీయాలు

*భారతదేశంలో ఐదు దశాబ్దాలుగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదనే చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. ఒకప్పుడు గ్రామీణ పేదలు, ఆదివాసీ లు, భూహీన కూలీల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన ఈ ఉద్యమం, నేడు తన రాజకీయ, సైనిక, సామాజిక పునాదులను కోల్పోతున్న దనే అభిప్రాయం బలపడుతోంది. ఇటీవల "ఆపరేషన్ కగార్" నేపథ్యంలో మావోయిస్టులపై జరిగిన భారీ దాడులు, నాయకత్వ నష్టాలు, బలగాల క్షీణత ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. అయితే కేవలం పోలీసు బలప్రయోగం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పడం సరికాదు. భారత సమాజంలో జరిగిన ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక మార్పులను అర్థం చేసుకోలేకపోవడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది.*



1990ల తర్వాత భారతదేశంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు వేగంగా అమలయ్యాయి. ఈ మార్పులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మాత్రమే కాదు, ప్రజల జీవనశైలిని, ఆశయాలను, వినియోగ సంస్కృతిని కూడా మార్చేశాయి. ఒకప్పుడు భూమి, జీతం, దోపిడీ వంటి ప్రశ్నల చుట్టూ తిరిగిన గ్రామీణ రాజకీయాలు, క్రమంగా ఉద్యోగాలు, విద్య, వలసలు, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ప్రపంచం వైపు మళ్లాయి. 1991లో భారతదేశంలో టెలిఫోన్ సాంద్రత చాలా తక్కువగా ఉండగా, ఇప్పుడు 100 కోట్లకు పైగా మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. ఇంటర్నెట్ వినియోగదారులు 90 కోట్లకు చేరువయ్యారు. ఈ మార్పు సామాజిక చైతన్యాన్నీ, రాజకీయ అవగాహనాన్నీ కొత్త దిశలో నడిపించింది.

మావోయిస్టు ఉద్యమం ఈ మార్పులను సమగ్రంగా అధ్యయనం చేయలేకపోయిందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు నగరాల్లో, విశ్వవిద్యాలయాల్లో, కార్మిక వర్గాల్లో బలంగా ఉన్న విప్లవ రాజకీయాలు క్రమంగా అడవులకే పరిమితమయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజా సంఘాల బలహీనత, మధ్యతరగతి విస్తరణ, వినియోగ సంస్కృతి పెరుగుదల, కొత్త ఉపాధి అవకాశాలు విప్లవ రాజకీయాల ఆకర్షణను తగ్గించాయి. సమాజం మారుతుంటే ఉద్యమ పద్ధతులు కూడా మారాలి. కానీ మావోయిస్టు నాయకత్వం పాత సిద్ధాంత భాషను, పాత వ్యూహాలనే ఎక్కువగా ఆధారపడిందనే విమర్శ ఉంది.

మరో ముఖ్య అంశం ప్రజా ఉద్యమాల నుండి సైనికీకరణ వైపు జరిగిన మార్పు. 1970లలో నక్సలైట్ ఉద్యమం భూస్వామ్య వ్యతి రేక పోరాటాల రూపంలో ఎదిగింది. తర్వాత విద్యార్థి, యువజన, రైతు సంఘాల ద్వారా విస్తరించింది. కానీ కాలక్రమేణా ప్రజా సంఘాల నిర్మాణం కంటే గెరిల్లా దళాల నిర్మాణానికే ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా ప్రజలతో ప్రత్యక్ష సంబంధం తగ్గిపోయింది. ఉద్యమం ప్రజల మధ్య జీవించే రాజకీయ శక్తిగా కాకుండా, అడవుల్లో పనిచేసే రహస్య సైనిక నిర్మాణంగా మారిపోయింది. ఇది దీర్ఘకాలికంగా ఉద్యమాన్ని ఒంటరితనంలోకి నెట్టింది.

ఇంకా ఒక కీలక అంశం ఆదివాసీ ప్రాంతాల మార్పు. ఒకప్పుడు రహదారులు, విద్య, వైద్యం, కమ్యూనికేషన్ లేని బస్తర్ వంటి ప్రాంతాల్లో మావోయిస్టులు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగారు. కానీ గత రెండు దశాబ్దాల్లో పరిస్థితి కొంత మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రోడ్లు, మొబైల్ నెట్‌వర్క్‌లు, టెలివిజన్, మార్కెట్ వ్యవస్థలు గ్రామాల్లోకి చొచ్చుకుపోయాయి. ఈ మార్పులు పూర్తిగా ప్రజా సంక్షేమాన్ని తీసుకురాలేకపోయినా, సమాజాన్ని మునుపటి స్థితిలో మాత్రం ఉంచలేదు. ప్రజలు ఇప్పుడు కేవలం "విప్లవం" గురించి కాకుండా, పిల్లల విద్య, ఆరోగ్యం, ఉపాధి, వలస అవకాశాల గురించి కూడా ఆలోచిస్తున్నారు.

ఇక ప్రభుత్వ వ్యూహం కూడా గణనీయంగా మారింది. ఒకప్పుడు పోలీసు చర్యలకే పరిమితమైన దాడులు ఇప్పుడు సాంకేతిక యుద్ధం గా మారాయి. డ్రోన్లు, శాటిలైట్ పర్యవేక్షణ, నైట్ విజన్ పరికరాలు, ప్రత్యేక దళాలు, కార్పెట్ సెక్యూరిటీ క్యాంపులు వంటి ఆధునిక పద్ధతులు ఉపయోగిస్తున్నారు. కేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకా రం, గత పదేళ్లలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయం గా తగ్గింది. 2010లో 200కు పైగా జిల్లాల్లో ప్రభావం ఉండగా, ప్రస్తుతం తీవ్ర ప్రభావిత జిల్లాలు 25–30 మధ్యకు పడిపోయాయని అధికార నివేదికలు చెబుతున్నాయి. హింసాత్మక ఘటనలు కూడా 70 శాతం కంటే ఎక్కువ తగ్గాయని ప్రభుత్వం పేర్కొంటోంది.

అయితే దీనిని కేవలం "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజయం"గా చూడ టం సరైంది కాదు. ఎందుకంటే మావోయిస్టు ఉద్యమం పుట్టుకకు కారణమైన అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి. భారతదేశం లో సంపద అసమానతలు విపరీతంగా పెరిగాయి. ఆక్స్‌ఫామ్ నివేదికల ప్రకారం దేశ సంపదలో భారీ భాగం కొద్ది మంది ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఆదివాసీ ప్రాంతాల్లో గనుల తవ్వకాలు, భూసేకరణ, అటవీ హక్కుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. నిరుద్యోగం, రైతు సంక్షోభం, కార్పొరేట్ ఆధిప త్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. కాబట్టి మావోయిస్టు ఉద్యమం బలహీనపడిందని చెప్పడం వేరే విషయం. కానీ, ఆ ఉద్యమానికి కారణమైన సామాజిక విరుద్ధతలు అంతమయ్యాయని చెప్పడం వేరే విషయం.

మావోయిస్టు నాయకత్వం చేసిన మరో పెద్ద పొరపాటు ప్రపంచ అనుభవాల నుండి సరైన పాఠాలు నేర్చుకోకపోవడం. శ్రీలంకలో ఎల్‌టిటిఇ పరాజయం, నేపాల్ మావోయిస్టుల రాజకీయ మార్పు, లాటిన్ అమెరికాలో గెరిల్లా ఉద్యమాల పరిణామాలు ప్రపంచానికి కొత్త సందేశాలు అందించాయి. కేవలం ఆయుధ పోరాటంతో దీర్ఘకాలిక రాజకీయ మార్పు సాధ్యం కాదని, ప్రజాస్వామ్య రాజకీయాలను పూర్తిగా తిరస్కరించడం ప్రమాదకరమని అనేక అనుభవాలు చూపించాయి. కానీ భారత మావోయిస్టు ఉద్యమం ఇంకా "సైనిక ఆధిపత్య" దృక్పథం నుండి పూర్తిగా బయటకు రాలేకపోయిందనే విమర్శ ఉంది. అంతిమంగా చూస్తే, మావోయిస్టు ఉద్యమం సంక్షోభం కేవలం అడవుల్లో జరిగిన సైనిక పరాజయం కాదు. అది ఒక రాజకీయ, సామాజిక, సిద్ధాంత సంక్షోభం కూడా. సమాజం వేగంగా మారుతుంటే, ఉద్యమాలు కూడా తమ పద్ధతుల ను, భాషను, వ్యూహాలను మార్చుకోవాలి. ప్రజల ఆశయాలు మారినప్పుడు రాజకీయాలు కూడా మారాలి. లేకపోతే చరిత్రలో ఒకప్పుడు గొప్ప శక్తిగా నిలిచిన ఉద్యమాలు క్రమంగా జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతాయి. అదే సమయంలో అసమానతలు, దోపిడీ, సామాజిక అన్యాయం కొనసాగి నంతకాలం ప్రతిఘటన కొత్త రూపాల్లో పుడుతూనే ఉంటుంది. ప్రశ్న ఇప్పుడు "మావోయిజం ఉందా లేదా?" అనేది కాదు; "ప్రజల అసంతృప్తి ఏ రూపంలో వ్యక్తమవుతుంది?" అన్నదే ముఖ్యమైనది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## రూపాయి!

ముష్టైత్తే
సింహాన్ని చూసారా?
పోనీ ఎలకను?
కుక్కను? నక్కను?
ఏజీవి ముష్టైత్తదు!
ఒక్కమనిషి తప్పు!

ఆత్మవంచనతో
సంపాదన కోసం
చెయ్యరాని పనులు
వంచన దగా మోసం
ఏ జీవి చెయ్యదు
ఒక్క మనిషి తప్పు!
కూటికి లేనివాళ్లు
కోట్లకు కుబేరులు
ఇద్దరూ మనుషులే!
ఒకే సమాజం లో
ఏజాతీఇలాఉండదు!
మానవ జాతి తప్పు!
ధనగర్వం పెరిగి
ఇష్టారాజ్యం!
వీళ్ళ సంతానం
చెలరేగిపోయి
'రేప్'లు 'రేస్'లు
మనుషులే వీళ్లు!
అల్పజీవుల్ని వేటాడే
'అడవి'కంటే హీనం
మానవసమాజం!
లౌకికరాజ్యం కూల్చి
మతరాజ్యంతేవాలని!
వీళ్ళుకూడామనుషులే!
ఇలాంటి సమాజాన్ని
దేవుడు సృష్టించలేదు
దేవుడికిరూపాయితెలీదు!
ఇది'రూపాయి'సమాజం
ఇలాగే ఉంటుంది!
సృష్టికర్త మనిషి కదా!
కష్టాలు బాపమని
దేవుడివద్దకు పోతారే?
ఇవి'రూపాయి'కష్టాలు!
దేవుడికి తెలీదు!
తెలిసినవాడు ఒక్కడే!
వాడిపేరు 'మనిషి'!
మనిషి మాయ ఇది!
వీడివల్లే ఈ బాధలు!
'రూపాయి'మజా!
అంతా దోపిడీ దగా
'రూపాయి'తోపని లేని
సమాజం కావాలి!
రూపాయిఆడేఆటే
ముష్టి,వ్యభిచారం
దారిద్ర్యం,నిరుద్యోగం
శాశ్వత పరిష్కారం
ఎవ్వడి వల్లా కాదు!
వీటి సృష్టికర్తే మనిషి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్


## ప్రేమ చలనం

మరణం లేని చలం
మండుతున్న ఇనగోళం
శశిరేఖ క్రాంతి రేఖలు
దైవమిచ్చిన భాగస్వామి
అనుబంధాలు
అందమైన మైదానం
వెన్నెల పరుచుకున్న మైదానం
కోరికలు గుర్రాలై
పరుగులు తీసే మైదానం
అదొక స్వేచ్ఛ
అదొక భావ స్వేచ్ఛ
ఓ పువ్వు కొత్త లోకపు
ఆత్మీయతలోకి...
చూపు చూపులో
తన్మయత్వం
వివిధ కోణాలు
అవి కొందరికి
మన్మథ బాణాలు
మరికొందరికి
సాంప్రదాయ శరాలు...
ప్రేమ లేని విశ్వం లేదు
మిథునం లేని ప్రకృతి లేదు
చలం లేకుండ
తెలుగు సాహిత్యం లేదు
చలం అంటే అనల చలనం
చలం అంటే ప్రేమ పవనం

రేడియమ్. 9291527757

## అడ్డు జేరనీ బురద..

పని ముట్ల మీద
షికాయతు కాదు..
సూర్యోదయాలకు
పురుడుపోసేవవే..
పాత బడి పొయ్నవీ
పదును కోల్పోయి..
పడావు అయ్నవెల్లా
కొలిమి గాలొద్ద మల్ల..
తొందరేం లేదు లెండి
కమ్మితేమ్లే గర్కసేనల్ల..
పల్లెర్లు లేస్తే పొలమెల్ల
సెడేది మేసేటి గాడిదే..
వాకిట్లవాలిన మబ్బెన్క
గుట్టుగా మాటు గాసిన..
గండు పిల్లుల మత్లబ్లు
గాలికిడ్సిన మూల్యాల..
గాయాలు యాదుంచి
గుర్తుబెట్టుకునుండాలె..
కాపుగాసే వేళ మాటేసి
కనికరాల కగ్గి పెట్టాలె..
ఊర్కులాటలు వొద్దు
వొగదినం కొరకుకాదు..
ఎల్లకాల ముండె జనం



విల్లంబులై లేసినద్వాలే..
దోస్తానాలు సుట్టరికాలు
గుంపు గట్టాకండి పోరిది..
అట్లైతే ఇండ్లల్ల తినిపండి
పైలమంటూ ముర్వొచ్చు ..
విల్వైన పానాలె బలి పెట్టి
పానమియ్యగ వొచ్చినోళ్ళు..
కోవర్టు లెవరో రెనగేడ్లెవ్వరో
రాజ్య సోపత్లు నిగ్గుదేలనీ..
తొక్కు లాడిన మడుగెల్లా
తేటబడనీ తెప్పైన నీళ్లెల్లా..
గడ్డిగాదాలు రప్పునతేలనీ
ఆగండి అడ్డు జేరనీ బురద..

- డా. ఇక్బాల్ పాషా
9440775732

# రా బిడ్డా రా... ఈ దేశాన్ని మార్చే ఆ ఒక్క అస్త్రం నీ దగ్గరే ఉంది!

ఒక అగ్నిశిఖ అలా మండుతూనే ఉంటుంది. కాలం ఎంత క్రూరంగా వీచినా, ఎవరైనా దాన్ని ఆర్పాలని చూసినా అది మరింత భగ్గుమంటుంది. ఆ ప్రచండ అగ్నిశిఖ పేరే 'ప్రశ్న'! మానవ నాగరికతా చరిత్రను, సమాజ గమనాన్ని నిజంగా తిప్పికొట్టినవారెవరూ చేతుల్లో ఆయుధాలు పట్టుకున్న ఒంటిబలం కలిగిన వీరులు కారు, వ్యవస్థల గుండెల్లోకి సాహసంగా ప్రశ్నలు సంధించిన మేధో రథికులు మాత్రమే. శతాబ్దాల బానిసత్వాన్ని నిలదీస్తూ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అడిగాడు,మా మాతృభూమిపై, మా బతుకులపై అధికారం చెలాయించే హక్కు అసలు మీకు ఎవరిచ్చారు? యుగయుగాల సామాజిక అణచివేతను బద్దలుకొడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రశ్నించాడు. ఒక మనిషిని పుట్టుకతోనే హీనంగా, అంటరానివాడిగా చూడడం ఏ రకమైన మానవత్వం? అందుకే, ఆ సింహనాదాలు కాల గర్భంలో కలిసిపోలేదు. దశాబ్దాలు దాటినా నేటికీ మన మనస్సాక్షిపై ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.కానీ, వర్తమాన భారతదేశంలో ఈనాటి నవతరం మాటేమిటి? స్మార్ట్‌ఫోన్ స్క్రీన్లపై తమ ముఖాలను దాచుకుంటూ, అల్గారిథమ్స్ విసిరే ట్రెండ్‌ల వెంట పిచ్చిగా పరుగెడుతూ, అసలు ఆలోచించే అద్భుత అవకాశాన్నే కోల్పోతున్న ఈ తరం ఏ ప్రశ్న వేస్తోంది? వారి మౌనం వెనుక ఉన్న రహస్యమేమిటి?మన దేశంలో యువత సంఖ్య అక్షరాలా 65 కోట్లు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ (Demographic Dividend) అని ప్రపంచ వేదికలపై మనం గర్వంగా చెప్పుకునే అతిపెద్ద మానవ వనరుల సామ్రాజ్యం మనది. కానీ, ఈ అపారమైన తారుణ్య శక్తి గనుక ప్రశ్నల రూపంలో, వైచారిక విప్లవంగా వెలువడకపోతే అది కేవలం జనాభా లెక్కల్లోని సంఖ్యాబలం మాత్రమే అవుతుంది కానీ సామర్థ్యం కాలేదు. ఒక నిర్జీవ రాయిలా, ఒక అచేతన యంత్రంలా, చెప్పింది చేయి అడిగింది రాసివ్వు అన్న చట్రంలో మునిగిపోతే, ఈ 65 కోట్ల సైన్యం కూడా చరిత్ర హెచ్చరించిన అంధుల గుంపులోనే కలిసిపోతుంది.అసలు ప్రజాస్వామ్యానికి అసలైన ఊపిరి, ప్రాణం ఎక్కడున్నాయి? ప్రతి ఐదేళ్లకొకసారి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం మాత్రమే పౌర బాధ్యత అని నమ్మితే అది భ్రమ. పాలకుడిని నిలదీయడం, పాలసీల వెనుక ఉన్న లోపాలను వెలికితీయడం, వ్యవస్థల వైఫల్యాలను ప్రశ్నించడం, తెరవెనుక దాగున్న అబద్ధాన్ని బట్టబయలు చేయడం ఇదీ అసలైన ప్రజాస్వామ్య సూత్రం. ఈ పవిత్రమైన పనిని చేయని పౌరుడు సమాజానికి మేలు చేసేవాడు కాదు, సరికదా తీవ్రమైన హాని చేసేవాడే అవుతాడు.ప్రశ్న అడగని నోరు ఎప్పటికైనా మూగపోతుంది. అది కేవలం ఒక వ్యక్తి మూగతనం మాత్రమే కాదు.ఒక దేశపు సమిష్టి మూగతనానికి నాంది అవుతుంది.మన సమకాలీన విద్యావ్యవస్థ మనకు ఏం నేర్పిస్తోంది? టెక్స్ట్‌బుక్‌లో రాసిన వాక్యాలను అక్షరం పొల్లు పోకుండా బట్టీ పట్టి, పరీక్ష కాగితంపై యథాతథంగా వంపించడమే నేడు ఉత్తమ విద్య కు పరాకాష్ఠ అయింది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పిన సిద్ధాంతాన్ని సందేహించడమో, దానికి భిన్నమైన కోణాన్ని ప్రదర్శించడమో అహంకారంగా, క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించే ఒక సంకుచిత వాతావరణంలో మన పిల్లలు పెరుగుతున్నారు. నాయకుడు చెప్పాడు మద్దతు ఇవ్వు అని ఇంట్లో పెద్దలు చెప్తే, ఎందుకు ఇవ్వాలి? అని ఎదురు ప్రశ్నించడం సంస్కారహీనతగా ముద్ర వేస్తున్నారు. అందరూ ఆ దారిలోనే వెళ్తున్నారు కాబట్టి నువ్వూ అదే దారిలో వెళ్ళు ఇది కేవలం ఒక ఉచిత సలహా కాదు, ఒక తరం మేధస్సుకు ఎక్కిస్తున్న నెమ్మదైన విషం.సందేహాలు లేకుం డా అంధంగా అనుసరించడం తాత్కాలికంగా చాలా సౌకర్యంగా, సురక్షితంగా అనిపించవ చ్చు. కానీ, ప్రపంచ చరిత్ర మనకు నేర్పిన అత్యంత చేదైన పాఠం ఏమిటంటే హిట్లర్ లాంటి క్రూర నిరంకుశు డికి కూడా అంధంగా అనుసరించే కోట్ల మంది అనుయాయులు ఉన్నారు. అందుకే, ఏ కాలంలోనైనా డిక్టేటర్ల కు, నియంతలకు ఉన్న ఏకైక పరమ శత్రువు ఎవరైనా ఉన్నారంటే అది ప్రశ్నించే సమాజం మాత్రమే!ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లు ఒక భయంకరమైన ఎకో చాంబర్ (Echo Chamber)గా మారిపోయాయి. అంటే, మనం ఏ సిద్ధాంతాన్ని అయితే నమ్ముతామో, అదే తరహా కంటెంట్‌ను అల్గారిథమ్స్ మనకు పదే పదే చూపిస్తాయి. ఫలితంగా, మన సగటు అభిప్రాయమే మళ్లీ మళ్లీ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఆ మూసి ఉన్న వర్చువల్ గదిలో బందీ అయినవారికి తాము నమ్మే అభిప్రాయమే సార్వజనీన సత్యం అనిపిస్తుంది. ఇదే సమాజానికి అత్యంత ప్రమాదకరమైన స్థితి.

ఒక యువకుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో ఒక రాజకీయ నేత భజనను చూస్తాడు, టెలివిజన్ డిబేట్లలో ఆ నేత గర్జనలను వింటాడు, వాట్సాప్ యూనివర్సిటీలో ఫార్వర్డ్ అయిన సగం నిజాల వ్యాసాన్ని చదువుతాడు అంతే, విశ్లేషణ లేకుండా ఇతనే యుగపురుషుడు అని ఫిక్స్ అయిపోతాడు. కానీ, ఒక్కసారైనా ఆ మీడియా హౌస్ ఎవరిది? ఆ వార్తను ఇప్పుడు ఎందుకు ప్రమోట్ చేస్తున్నారు? ఆ గ్రాఫ్స్, అంకెలు నిజమేనా? అని గుచ్చి గుచ్చి అడుగుతున్నాడా? ఈ రకమైన ప్రాథమిక ప్రశ్నలు వేయడం సమాజం ఎప్పుడైతే ఆపేస్తుందో, అప్పుడే ప్రజాస్వామ్యం ఐసీయూలో పడ్డట్టు లెక్క.ప్రపంచ విప్లవాల పుటలను తిరగేస్తే, ప్రతి గొప్ప మార్పు వెనుక ఒక బలమైన ప్రశ్న నిలిచి ఉంది.గెలీలియో అడిగాడు భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతాడనేది చర్చి సిద్ధాంతం. కానీ సైన్స్ ఏం చెబుతోంది? నిజంగా తిరుగుతాడా? అందుకు ఆయన జైలు పాలయ్యాడు, అవమానాలు భరించాడు. కానీ చివరికి సత్యమే గెలిచింది.బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రశ్నించాడు మనుధర్మం నిర్దేశించిన ఈ అమానవీయ వర్ణ వ్యవస్థ దైవ నిర్ణయమా? దీన్ని ఎందుకు అంగీకరించాలి? ఆ ఒక్క ప్రశ్నే భారతదేశానికి సామాజిక న్యాయాన్ని అందించే సర్వోత్కృష్ట రాజ్యాంగాన్ని తీర్చిదిద్దింది. మహాత్మా జ్యోతిరావు ఫూలే అడిగాడు సృష్టిలో సగభాగమైన స్త్రీకి విద్య ఎందుకు నిరాకరించాలి? ఆమెకు ఆ హక్కు లేదా? ఆ ప్రశ్న నుంచే ఆధునిక భారతదేశంలో బాలికల చదువుల బడులు జవాబులుగా మొలిచాయి.ఇక్కడ ఒక ముఖ్యమైన అపోహను మనం ముందే తొలగించుకోవాలి. ప్రశ్నించడం అంటే వ్యవస్థలపై తిరుగుబాటు చేయడం కాదు, అరాచకత్వాన్ని సృష్టించడం కాదు. నిరంతరం ప్రభుత్వాన్ని దూషించడమో, నాయకులను శత్రువులుగా చూడడమో కాదు. ప్రశ్నించడం అంటే బాధ్యతాయుతమైన పౌరుడిగా నిలబడడం.ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? దీని దీర్ఘకాలిక ప్రభావం ఏమిటి? ఈ సంక్షేమ పథకం నిజంగా లబ్ధిదారుడికి చేరుతోందా లేదా? ఈ అంకెల వెనుక ఉన్న అసలు వాస్తవాలు ఏంటి? అని హుందాగా నిలదీయడం.పాలకులకు జవాబుదారీతనం ఉండాలని, పత్రికలు నిర్భయంగా సత్యం మాట్లాడాలని, న్యాయస్థానాలు నిష్పక్షపాతంగా తీర్పులు ఇవ్వాలని పట్టుబట్టడం ఇదే ఉత్కృష్టమైన దేశభక్తి. ఇంట్లో తండ్రి తప్పు చేసినప్పుడు, కుటుంబం మేలు కోరే కొడుకే కదా దాన్ని మందలిస్తాడు? అలాగే, తన దేశాన్ని నిజంగా ప్రేమించే పౌరుడే దేశంలో జరుగుతున్న తప్పిదాలపై గళమెత్తుతాడు.మన భారత రాజ్యాంగం ఈ విషయంలో అత్యంత స్పష్టతను ఇచ్చింది. అధికరణ 19 (Article 19) ప్రకారం భావప్రక టన స్వాతంత్ర్యం, సమాచార హక్కు, మాట్లాడే హక్కు ఇవన్నీ మన ప్రజాస్వా మ్య సౌధానికి మూలస్తంభాలు. ఈ హక్కులను మనం వినియోగించుకోక పోతే, కాలక్రమేణా వాటిని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది. వ్యవస్థలు తమంతట తాము మారవు.అవి మారాలంటే పౌర సమాజం నుండి నిరంతర ఒత్తిడి అవసరం. ఆ చైతన్యవంతమైన ఒత్తిడి కేవలం ప్రశ్నించే గళాల నుంచే వస్తుంది.నేటి కార్పొరేట్ కళాశాల విద్యార్థిని ఒకసారి గమనించండి. పరీక్షల్లో 95 శాతం మార్కులు, ర్యాంకులు సాధిస్తాడు. కానీ, తను ఉండే నగరంలో కలుషిత నీరు ఎందుకు వస్తోందని మున్సిపల్ అధికారులను అడగడు. దేశానికి వెన్నెముక అయిన రైతు ఎందుకు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నాడో పట్టించుకోడు. ప్రధాన స్రవంతి పత్రికల్లో రావాల్సిన కీలకమైన ప్రజా సమస్యల వార్తలు ఎందుకు మాయమవుతున్నాయో విశ్లేషించడు.ఈ నిరాసక్తత అనేది కేవలం అజ్ఞానం కాదు. వ్యవస్థలు అతనికి అలవాటు చేసిన నేర్పించిన మూగతనం (Learned Helplessness). క్లాస్‌రూమ్ అతనికి కెరీర్‌కు కావలసిన సాంకేతిక జ్ఞానాన్ని ఇచ్చింది కానీ, ఒక పౌరుడిగా ఉండాల్సిన కనీస పౌరస్పృహ ను ఇవ్వలేదు. ఇక్కడే మన విద్యావిధానం ఘోరంగా విఫలమైంది.అయినప్పటికీ, మనం పూర్తిగా నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ఈ డిజిటల్ వ్యసనాల మధ్య కూడా నిశ్శబ్దంగా మార్పు మొదలైంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఇరవై ఏళ్ల యువతి అంతర్జాతీయ వేదికలపై గళమెత్తుతోంది. ఆర్టీఐ (RTI) దరఖాస్తుల తో అవినీతి తిమింగలాల గుండెల్లో నిద్రపోతున్న సామాన్య కార్యకర్తలు గ్రామాల నుండి పుట్టుకొస్తున్నారు. ఇవి ప్రస్తుతం చిన్న చిన్న మంటలు కావచ్చు. కానీ చరిత్ర నిరూపించిన సత్యం ఒక్కటే మహా విప్లవాలన్నీ ఒక చిన్న నిప్పు కణిక నుంచే ప్రయాణాన్ని ప్రారంభిస్తాయి.బహుకోణాల అధ్యయనం (Critical Thinking) ఏదైనా ఒక అంశంపై కేవలం ఒక పక్షం వాదనను మాత్రమే చదివితే సగం సత్యమే తెలుస్తుంది. ఏ సమాచారం మన ముందుకు వచ్చినా, ఇది ఎవరు చెప్పారు? ఎందుకు చెప్పారు? దీని వెనుక వారి స్వార్థ ప్రయోజనం ఏంటి? అని క్రాస్ చెక్ చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.స్థానిక సమస్యలపై స్పందన, మీ వీధిలోని డ్రైనేజీ సమస్య నుండి దేశ రక్షణ విధానం వరకు ప్రతి స్థాయిలో ఒక పౌరుడిగా మీకు హక్కు ఉంది, బాధ్యత ఉంది. గ్రామ సభలు, మున్సిపల్ సమావేశాలకు హాజరుకావడం ద్వారానే ప్రజాస్వామ్యానికి శ్వాస అందుతుంది.వైచారిక చైతన్యాన్ని రగల్చడం ,మీ చుట్టూ ఉన్న మిత్రులలో ఈ ఆలోచనా దృక్పథాన్ని నాటండి. ఒక ప్రశ్న మరో వంద ప్రశ్నలకు జన్మనిస్తుంది. ఒక్క మేధస్సు మేల్కొంటే, అది వంద మందిని నిద్ర లేపుతుంది. ఈ వ్యాసం చదివిన పాఠకులకు నాదొకటే చిన్న విన్నపం. ఈ రాత్రి మీరు నిద్రపోయే ముందు మనస్సాక్షిగా ఒక్క ప్రశ్న వేసుకోండి ఈ రోజు నేను సమాజంలో చూసిన దేన్నైనా సందేహించానా? ఏ విషయాన్నైనా తార్కికంగా విశ్లేషించానా? కళ్లముందు కనపడ్డ ఏ అబద్ధాన్నైనా ఐడెంటిఫై చేశానా?ఒకవేళ మీ సమాధానం లేదు అయితే రేపటి నుండైనా మీ ఆలోచనలకు పదును పెట్టండి. ఎందుకంటే, మనం ప్రశ్నించడం ఆపేసిన రోజే మన స్వాతంత్ర్యానికి చరమగీతం మొదలవుతుంది. ఒక్కో ప్రశ్న ఒక్కో బానిసత్వపు గొలుసును తెంపుతుంది.రా బిడ్డా రా నువ్వే ఆ ప్రశ్నించే తరమవ్వాలి! ఈ దేశపు చీకటిని చీల్చే సూర్యకిరణం నీ ప్రశ్నే!



డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు నేరుగా, పారదర్శకంగా అందించడమే జిల్లా యంత్రాంగం ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, డీఆర్వో చంద్రావతి, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్, ఆలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి, ముదుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఐ కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు సాధిస్తున్న విజయాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలుగా ప్రారంభమైన వ్యాపారాలు శిల్పారామంలో స్టాళ్లు ఏర్పాటు చేసే స్థాయికి ఎదగడం మహిళల ప్రతిభకు నిదర్శనమన్నారు.

# గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 22 (జనం సాక్షి) :** ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, పరిగి శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరిగి శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గతంలో కంటే రెట్టింపు రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట ప్రభుత్వం రేషన్ కార్డు కలిగి ఉన్న ఇంటి యజమాని మరణించినట్లయితే ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ చేయడం జరుగుతుందని, జిల్లాలో ఆత్మ కమిటీలను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పరిగి మండలంలో రైతు విజ్ఞాన కేంద్రం మంజూరు అయ్యిందని దీనికి సంబంధించి మిట్టకోడూరులో 40 ఎకరాలు స్థలాన్ని కేటాయించాల్సింగా ఆయన కోరారు. 400 కెవి విద్యుత్ స్టేషన్ కు 84 ఎకరాలు, 33/11 కెవి సబ్ స్టేషన్ కు కావలసిన స్థలాలను కేటాయించినట్లయితే పనులు చేపట్టవచ్చునని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మిషన్ భగీరథ మంచినీరు అందని ప్రాంతాలను గుర్తించి బోర్లను వేసి నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అటవీ పందుల కారణంగా పంటలు నష్ట పోతున్నాయనే ఉద్దేశ్యంతో పంట పొలాలకు విద్యుత్తు కంచెలు వేయడం వల్ల విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అలాకాకుండా ప్రత్యామ్నాయ విధానాలను ఎంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో అనుకున్న మేరకు గ్యాస్ సబ్సిడీ సిలిండర్లు అందడంలేదని తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సౌలభ్యం కోసం అదనంగా కొత్త చౌకధర దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాకు సాగునీరు తాగునీర అందించే విధంగా 10 వేల కోట్ల అంచనాలతో 2.8 సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి భూ సేకరణకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 6 లైన్లతో కూడిన 35 వేల కోట్ల వ్యయంతో చేపట్టే రీజినల్ రింగ్ రోడ్డుకు భూ సేకరణ పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. జిల్లాలోని పూడూరు ప్రాంతంలో నేవీ ప్రాజెక్టు పనులు వేకవంతంగా చేపట్టడం జరుగుతుందని, దీనివల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో 200 కోట్ల వ్యయంతో చేపట్టే యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. జిల్లాలో ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్ , కె.వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లు పట్లోల నీరజ బాల్ రెడ్డి, కుందుమళ్ళ రజిత, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా క్రీడా యువజన శాఖ ఆధ్వర్యంలో క్రీడల సామాగ్రి, పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మెడిటోరియల్ సర్టిఫికెట్ లు ఎమ్మెల్యే , కలెక్టర్ అందజేశారు. అదేవిధంగా వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు.



# డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్‌పై ఏసీబీ మెరుపుదాడులు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు
- ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాల సోదాలు..
- భూములు, ప్లాట్లు, ఆస్తి పత్రాల స్వాధీనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం భారీ స్థాయిలో దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో నమోదైన కేసు నేపథ్యంలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని ఆయన నివాసాలు, కార్యాలయాలు, అనుబంధ ప్రదేశాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం వంశీ మోహన్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో శేరిలింగంపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి హోదాలో పనిచేసిన సమయంలో భూ వ్యవహారాలకు సంబంధించిన అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కూడా అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోదాల్లో భూముల



పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక రికార్డులు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను అధికారులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపూర్ ప్రాంతాల్లో సుమారు ఎనిమిది ఎకరాల భూమిని బంధువుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అభివృద్ధి కోసం అప్పగించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అదే వ్యాపార వర్గాల నుంచి పది ప్లాట్లు బహుమతి పత్రాల రూపంలో కుటుంబ సభ్యుల పేర్లపై బదిలీ అయినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన భూములు, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, కీలక పత్రాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. అయితే స్వాధీనం చేసుకున్న ఆస్తుల ఖచ్చితమైన విలువపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. భూ కేటాయింపులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆస్తుల లావాదేవీలపై అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. వంశీ మోహన్ గతంలో పలు కీలక రెవెన్యూ పదవుల్లో పనిచేసిన అనుభవం కలిగిన అధికారి. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ దాడులతో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఆయిల్‌పామ్ పంటకు ప్రభుత్వం ప్రోత్సాహం



**సంగారెడ్డి ప్రతినిధి, మే 21 (జనం సాక్షి) :** రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ గారుహాజరై స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులకు స్థిరమైన మరియు అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.అదేవిధంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను మరియు రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ధాన్యపు కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**వనపర్తి బ్యూరో, మే 22 (జనంసాక్షి) :** ధాన్యపు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్అ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పాన్గల్ మండలంలోని దవాజీపల్లి, పాన్గల్ ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో జరుగుతున్న కొనుగోలు తీరును, ధాన్యం నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు, నిర్వాహకులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్ష సూచనలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వీలైనంత వేగంగా సేకరించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. మిల్లుల్లో ధాన్యం దించుకోవడానికి ఉన్న వసతులను, నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించి, వేగంగా దించుకోవాలని, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లుల యజమానులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాధ్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## విషపూరిత ఫార్మాసిటీకి స్వస్తి చెప్పాం



**ఇబ్రహీంపట్నం, మే 22 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా మనుగడను దెబ్బతీసేలా గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన విషపూరిత ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రపంచస్థాయిలో ఈ ప్రాంతాన్ని నిలబెట్టేలా ఫ్యూచర్ సిటీకి నాందీ పలికామని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం కొంగరకలాన్ లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగింది. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, యాదయ్య, ఈర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, చల్లా నరసింహారెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. 99రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు చెక్కులు పంపిణీ చేశారు.

## పక్కా ఓటర్ల జాబితా తయారే లక్ష్యం

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 22 (జనం సాక్షి) :** ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం ,రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,.. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పనిచేస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జూన్ 15 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. జూన్ 15 నుంచి 24 వరకు బూత్ స్థాయి అధికారులకు శిక్షణ, ప్రిపరేషన్, ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్ర విచారణ చేపడతారని తెలిపారు. జూలై 24న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడం జరుగుతుందని, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని వివరించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం చేపడతారని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు.




### బీఎల్‌ఓల పాత్ర అత్యంత కీలకం

కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని తెలిపారు. స్థానికంగా మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి బాధ్యతలు బీఎల్‌ఓలపై ఉంటాయని స్పష్టం చేశారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కూడా స్పష్టతనిస్తూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 2 కిలోమీటర్లకు మించి ప్రయాణించాల్సిన అవసరం లేకుండా సమీప ప్రాంతాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులపై అక్రమ మట్టి దందా ఆపాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

**అయిజ, మే 22 (జనంసాక్షి) :** అయిజ మండలం బింగిదొడ్డి గ్రామంలో ప్రజా ఆగ్రహం వెల్లువెత్తింది. అక్రమ మట్టి రవాణాపై అధికార యంత్రాంగం మౌనం అనుమానాలకు తావిస్తోంది. ఐజ మండలం బింగిదొడ్డి గ్రామ శివారులో గల పెద్ద చెరువును లక్ష్యంగా చేసుకుని గత కొన్ని రోజులుగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు నేడు తీవ్ర ప్రజా ఆగ్రహానికి దారితీశాయి. చెరువులోని మట్టిని మాత్రమే కాకుండా చెరువు కట్టను సైతం హిటాచీ యంత్రాలతో తవ్వించి, టిప్పర్లు మరియు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయల ప్రజా సంపదను దోచుకుంటున్నారని గ్రామ ప్రజలు ఆరోపించారు. ఈ అక్రమ మట్టి రవాణాను అడ్డుకునేందుకు గ్రామ ప్రజలు గత మూడు నాలుగు రోజులుగా ప్రయత్నిస్తున్నప్పటికీ అధికార పార్టీ అండతో అక్రమ దందాదారులు మరింత రెచ్చిపోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నేడు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఒక్కటై హిటాచీలు, టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకుని అక్రమ మట్టి రవాణాను నిలిపివేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు మొరుగు వీరేష్ మాట్లాడుతూ, ప్రజల చెరువులు కళ్లముందే దోపిడీకి



గురవుతున్నా రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖ, పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందన్నారు. రాత్రింబవళ్లు టిప్పర్లు తిరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడులు ఉన్నాయా అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో ఎలాంటి అధికార హోదా లేని కొంతమంది నాయకులు అధికారులను అడ్డుపెట్టుకుని బహిరంగంగా ప్రజా వనరులను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల ఆగ్రహాన్ని చూసి కొంతమంది అక్కడి నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు ప్రజల సంపదను దోచుకునే వారినే రక్షించడానికి రావడం బాధాకరమని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. బింగిదొడ్డి ప్రజలు నేడు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారని, ప్రజా వనరులను దోచుకునే రాజకీయ నాయకులను ఇకపై సహించబోమని హెచ్చరించారని చెప్పారు. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదని, అలంపూర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అక్రమ మట్టి – ఇసుక దందాలకు వ్యతిరేకంగా మొదలైన ప్రజా ఉద్యమమని మొరుగు వీరేష్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు, మైనింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు మరియు పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ దందాలను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే రోడ్లెక్కి తమ చెరువులు, భూములు మరియు సహజ వనరులను కాపాడుకునే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సింధనూరు ఉప్పరి గంగాధర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రంగు తిప్పారెడ్డి, పి.జి.కే వెంకటేశ్వరరావు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు



**జడ్చర్ల, మే 22 (జనంసాక్షి) :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ, ప్రతి బస్తీకీ చేరవేయడమే భారతీయ జనతా పార్టీ ముఖ్య ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగలి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీజేపీ బస్తీ బాట కార్యక్రమ ప్రచార కరపత్రాలను శుక్రవారం ఆయన, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్‌తో కలిసి ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలుసుకోవడమే మా లక్ష్యం పరిష్కారమే మా బాధ్యత అనే నినాదంతో బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికీ వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి దాస్ నాగరాజు, సతీష్ కుమార్, నాయకులు మాచారం కృష్ణ, పోలేపల్లి జంగయ్య, స్థానిక బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
23 మే 2026

# దళారీ వ్యవస్థ లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తి బ్యూరో, మే 22 (జనంసాక్షి) :** దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉన్నారు. కార్యక్రమానికి ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన



పథకాలకు తోడుగా అదనంగా మరిన్ని పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. విద్యా వైద్యంపై ప్రధాన దృష్టి సారించి, వీటికి ప్రధానంగా నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో బాగా పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు రుణ మాఫీ పథకం ద్వారా 61,687 మంది రైతులకు రూ.491 కోట్ల లబ్ధి చేకూర్చడం జరిగింది అన్నారు. రైతు భరోసా కింద 1,83,839 మంది రైతులకు రూ. 140 కోట్ల పెట్టుబడి సాయం అందించమన్నారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమం కింద జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో 16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వనపర్తి, చిన్నంబావి మండలాలకు చెందిన మహిళా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి కింద బస్సులను అందజేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫోటో ప్రదర్శనల్ని ముఖ్య అతిథులు సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంధాలయం ఛైర్మెన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, పెబ్బేరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మునిసిపల్ ఛైర్పర్సన్ అరుణ, ఆత్మకూరు మునిసిపల్ ఛైర్పర్సన్ నాగమణి, అమరచింత మునిసిపల్ ఛైర్పర్సన్ సువర్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డివో సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణలతో సీసీ కెమెరాలు కీలకం

● మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**రేగోడ్, మే 22 (జనంసాక్షి) :** నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం రేగోడ్ పోలీస్ స్టేషన్ను ఎస్పీ శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్లు చేపట్టాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో పోలీసింగ్ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక, సందీప్ రెడ్డి, ఏఎస్సై శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెనువెంటనే దిగుమతి చేసుకోవాలి



**వెల్దుర్తి, మే 22 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెనువెంటనే దిగుమతి చేసుకోవాలని వెల్దుర్తి శ్రీనివాస్ రైస్ మిల్లర్లకు తెలిపారు శుక్రవారం రోజు మండలంలోని పలు రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు కేంద్రం నుండి వచ్చిన దాన్యాన్ని వెనివెంటనే దిగుమతి చేసుకోవాలని ఆయన రైస్ మిల్లర్లకు సూచించారు గత నెల రోజుల నుండి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని పెట్టుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు అందరికీ తెలిసిందేనని ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్కెత్తయితే రైతులు కొనుగోలు కాక కొనుగోలు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం మనందరికీ తెలిసిన విషయమని దయచేసి రైస్ మిల్లర్లు వచ్చిన లారీలను వెనివెంటనే దిగుమతి చేసుకొని ధాన్యం కొనుగోలు సహకరించాలని ఆయన రైస్ మిల్లర్లను కోరారు.

# వికలాంగుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

● రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 22 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధితో పాటు దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన లక్ష్యమని రాష్ట్ర పాడి పరిశ్రమ, యువజన క్రీడలు,మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రం లోని ఒక ఫంక్షన్ హాల్ లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా సంక్షేమం,దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగులఅభివృద్ధి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమా లు అమలు చేస్తోందని తెలి పారు. కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు దివ్యాంగుల జీవితాల్లో మరింత ఆత్మ విశ్వాసాన్నిపెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. దివ్యాం గుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దన్నలా, ఆత్మీయ బంధు వులా అండగా నిలుస్తున్నా రని తెలిపారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్య




మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాం గులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల వివాహ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలలోపు దివ్యాంగ చిన్నా రులకు శస్త్ర చికిత్సలు నిర్వ హించి సాధారణ జీవితం గడిపేలా చేయడం కోసం "బాల భరోసా"కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకర ణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభు త్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక మాట్లాడుతూ దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అంది స్తున్న ఉపకరణాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభు త్వం తరపున అందించబ డతాయని తెలిపారు. దివ్యాంగ మహిళలు తప్పని సరిగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్లలో చేరాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ మాట్లా డుతూ దివ్యాంగులకు అంది స్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హు లైన ప్రతి దివ్యాంగునికి సహా య పరికరాలు అందజేస్తా మని, ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎస్.శ్రీను,ఆర్డీఓ ఎల్. రమేష్ , డీపీవో సుధాకర్ రెడ్డి ,ఇతర జిల్లా అధికా రులు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి, లబ్ధిదారులు, దివ్యాంగులు,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాలయాల చుట్టూ నిర్మాణాలను అడ్డుకుందాం



**సంగారెడ్డి, మే 21 (జనం సాక్షి) :** బీరంగూడ గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామని అధ్యక్షులు అదేల్లి రవీందర్ అన్నారు. శుక్రవారం బీరంగూడ గ్రామ అధ్యక్షులు అదేల్లి రవీందర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... బీరంగూడ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను జిహెచ్ఎంసి అధికారాలతో ఫోన్లో మాట్లాడి వివరించడం జరిగిందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దీర్ఘకాలంగా పెండింగ్లో పెట్టకుండా త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. శుంబుణికుంట చెరువు, స్మశాన వాటికలోని సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం చుట్టుపక్కల నిర్మాణాలు జరగకుండా చూడాలన్నారు. మహాశివరాత్రి పర్వదినంలో వేలాది మంది భక్తులు దర్శనం కోసం రావడం జరుగుతుందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయం చుట్టూ పక్కల అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే అధికారులను, ప్రజా ప్రతినిధులను కలవడం జరుగుతుందని రవీందర్ తెలిపారు. సమావేశంలో ఉపాధక్షులు పిర్జపతి సత్యనారాయణ, నక్కల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం, కోశాధికారి బంటు శివ, కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్, కుహది ప్రభాకర్, ఎడ్ల అశోక్ పాల్గొన్నారు.

## శారీరక దృఢత్వం ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరం

● దేశ భవిష్యత్తు కోసం యువత పాటుపడాలి
● జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు



**నాగర్‌కర్నూల్, మే 22 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ చిన్నతనం నుండే ప్రతి విద్యార్థి తన శరీర దృఢత్వాన్ని పెంచుకునేందుకు కృషి చేస్తూ యువత దేశ భవిష్యత్తు కోసం పాటుపడాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో లక్ష అథ్లెటిక్స్ కోచింగ్ అకాడమీ కోచ్ మల్లేష్ ఆధ్వర్యంలో నిత్యం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రముఖ న్యూరాలజీ వైద్యులు డాక్టర్ హేమంత్ కుమార్ న్యూరో ఫిజీషియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ అకాడమీ ఏకరూప 60 దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా అదనపు ఎస్పి హాజరై మాట్లాడారు. తరగతి గదుల్లో విలువలతో కూడిన విద్యతో పాటు శరీర దృఢత్వాన్ని పెంచుకునేందుకు మైదానంలోనూ నిత్యం వ్యాయామం ఎంతో అవసరం అన్నారు. అందుకు నిత్యం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మల్లేష్ సేవలు అభినందనీయమని కఠోర శిక్షణ గుర్తించిన ప్రముఖ న్యూరాలజీ వైద్యులు డాక్టర్ హేమంత్ న్యూరో దాతృత్వం ఎంతో గొప్పది అన్నారు. 30 విద్యార్థులందరికీ స్పోర్ట్స్ ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలనుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. వాటి విలువ 50వేల రూపాయల ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ, విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నీటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వి. ప్రియాంక, ఈ.ఎన్.టి. స్పెషలిస్ట్ డాక్టర్ త్రినాథ్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ వివేక్, ఫిజియోథెరపీ నిర్వాహకులు చంద్రపాల్ రెడ్డి, కోచ్ మల్లేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## రైతులు కొనుగోలు కేంద్రాలలోని జొన్నలు విక్రయించండి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టిజిఐఐసి ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సదాశివపేట, మే 22 (జనం సాక్షి) :** రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. సదాశివపేటలో మార్క్ ఫెడ్,పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టిజి ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు కొనుగోలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అలవేణి నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్,మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి,పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్ గౌడ్,సర్పంచులు, కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు యువతకు ఆదర్శం

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, మే 22 (జనం సాక్షి) :** సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, ఆత్మగౌరవం, సమాన హక్కుల కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, సమానత్వ భావనతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు ,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి,జిల్లా అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలు


**గద్వాల నడిగడ్డ, మే 22 (జనం సాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతుందని రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఇప్పటివరకు పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల గురించి శుక్రవారం గద్వాలలోని బృందావన్ గార్డెన్ లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతాన్ని ఆలపించిన అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే కాక ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన, త్వరలో అమలు చేయబోయే వివిధ సంక్షేమ పథకాల, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు మూడు నెలలకు పైగా సుదీర్ఘంగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలోనూ అరైవ్, అలైవ్ వారోత్సవాల్లో ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించామన్నారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది మరణించడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని వాహనదారులు సురక్షిత ప్రయాణం చేసి క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే లక్ష్యంతో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగిందన్నారు. యువత డ్రగ్స్ కు బానిసలు కారదనే ఉద్దేశంతో ప్రభుత్వం యువతకు అవగాహన కల్పించడమే కాక డ్రగ్స్ సమాచారం అందించే వారికి ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. విద్య, వైద్యం, తదితర శాఖల కార్యక్రమాలను కూడా విజయవంతంగా నిర్వహించారన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు ఈ కార్యక్రమం సువర్ణావకాశంగా పేర్కొంటూ, ప్రభుత్వ పథకాలపై, కార్యక్రమాలపై వారికి కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.




అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 10 అంశాలను ప్రధానంగా తీసుకొని 99 రోజులపాటు పలు శాఖలకు సంబంధించి వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మునిసిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి మే 22 (జనం సాక్షి) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ"తో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేలా జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇటీవల నిర్వహించిన మెగా రైతు మేళా ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలను అధికారులు సమావేశంలో వివరించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు, రైతులకు స్ప్రేయర్లు, స్ప్రింక్లర్లు, దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు అందజేశారు.

### ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రముఖ సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానిది స్వచ్ఛమైన పాలన

- అర్హులైన వారందరికీ పథకాలు చేరుతున్నాయి
- ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం
- హాజరైన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, సిపి సన్ ప్రీత్ సింగ్, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సర్పంచులు మున్సిపల్ చైర్ చైర్ పర్సన్స్



**వరంగల్ బ్యూరో, మే 22 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం వరంగల్ హంటర్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బస్వరాజ్ సారయ్య, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ సారంగపాణి, సన్‌ప్రీత్ సింగ్, డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తోందన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మి, రైతు భరోసా వంటి పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలవు తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరుతున్నాయని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి, విద్యా రంగ బలోపేతం, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడు తోందన్నారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా కల్పించే వినూత్న పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకురానుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల హాజరు శాతం పెంపు కోసం ఈ విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో 10 కీలక అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, రోడ్డు భద్రత, మహిళా-శిశు రక్షణ, యువజన మరియు క్రీడా కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ లెటర్లు అందజేశారు. తెలంగాణ నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎం సువిధా - నాబార్డ్" శిక్షణ పూర్తి చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో 427 స్వయం సహాయక సంఘాలకు రూ.28 కోట్లు 28 లక్షల బ్యాంక్ లింకేజ్ రుణాల చెక్కులు అందజేశారు. అలాగే వడ్డీ లేని రుణాల పథకం కింద డిసెంబర్ 2023 నుంచి నవంబర్ 2025 వరకు 9,669 స్వయం సహాయక సంఘాలకు రూ.40 కోట్లు 67 లక్షల చెక్కులను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు కరీమాబాద్, మట్టవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్ మరియు నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఆనందం, సంబంధిత జిల్లా అధికారులు, మండల తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# కూతురిని 20 లక్షలకు అమ్ముకొన్న వ్యక్తి అరెస్ట్



**జనగామ ప్రతినిధి, మే 22(జనంసాక్షి):** కూతురిని ఇరవై లక్షలకు అమ్ముకొని, బలవంతశీగా ఇష్టం లేని పెళ్లి చేసిన తండ్రిని, సవతి తల్లిని మరియు వివాహం చేసుకున్న వ్యక్తిని జనగామ పోలీసులు అరెస్ట్ చేసినారు. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల లహరి అను 18 సంవత్సరాల అమ్మాయి గౌతమి జూనియర్ కాలేజ్ జనగామ నందు ఇంటర్మీడియట్ కంప్లీట్ చేయగా, లహరి యొక్క తండ్రి రాకేష్ గౌడ్ మరియు ఆమె యొక్క సవతి తల్లి రేణుకలు ఇద్దరు కలిసి తన కూతుర్ని 20 లక్షల రూపాయలకు పెంబర్తి గ్రామానికి చెందిన ఆవుల ప్రశాంత్ రెడ్డికి అమ్మి, అతనితో లహరి యొక్క వివాహం చేసినారు, ఒకవేళ వివాహం చేసుకోకపోతే వారిద్దరు పురుగుల మందు తాగి చనిపోతామని బెదిరింపులకు పాల్పడినారు, అందుకు ఆమె పెళ్లి ఇష్టం లేకున్నా అతనితో తేదీ: 08.05.2026 రోజున పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంది. అనంతరం ఆమె తేదీ: 21.05.2026 రోజున ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని తల్లిదండ్రులు మరియు వివాహం చేసుకున్న ఆవుల ప్రశాంత్ రెడ్డి పై జనగామ ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేసి ఈ రోజు ముగ్గురు నిందితులను రిమాండ్ కి పంపించినారు.

బచ్చన్నపేటకు చెందిన కక్కెర్ల రాకేష్‌గౌడ్, కక్కెర్ల రేణుక, కక్కెర్ల లహరిలను అరెస్టు చేసి 276/2026 యూ/ఎస్ 83,87,143,351(2) ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ పెట్టారు. ముగ్గురు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి, ఎస్సై భరత, చెన్నకేశవులు పీసీలు కర్ణాకర్, కృష్ణ, అనిల్ కుమార్, రమేష్, మధు లను జనగామ ఇన్చార్జ్ ఏసిపి భీమ్ శర్మ అభినందించారు.

# అగ్నిప్రమాదంలో రైతుకు రూ.3.5 లక్షల ఆస్తి నష్టం



**నెన్నెల్ మే, 22 (జనం సాక్షి) :** నెన్నెల్ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బొమ్మన మురళీధర్ గౌడ్‌కు చెందిన వ్యవసాయ కొట్టం కరెంట్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో వ్యవసాయానికి ఉపయోగించే విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో 60 పిక్లర్ పైపులు, 700 మీటర్ల త్రీ-ఫేజ్ వైర్, రెండు స్టార్టర్లు, బోరు చుట్టూ ఏర్పాటు చేసిన పించింగ్ కోయలు తదితర సామగ్రి కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంతో సుమారు రూ.3.5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు వెల్లడించారు. ఘటన విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత రైతును ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఆదుకుని తక్షణమే నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు.. ఒకరు పరార్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 22(జనంసాక్షి):** వాంకిడి మండలంలోని బంబారా గ్రామ పరిధిలో గంజాయి అక్రమంగా కలిగి ఉన్న చునార్కర్ శ్రీకాంత్, గణపత్ బావంకర్‌తోపాటు ఓ మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్ తెలిపారు. మరో నిందితుడు ఆదిత్య పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 820 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 20,500 రూపాయలు ఉంటుందని వెల్లడించారు. అక్రమ మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, విక్రయాలపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని డిఎస్పీ అశోక్ హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, మే21 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తున్నామని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు దత్తాద్రి, అంకం మౌనిక, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు, బాల్యవివాహాల నివారణకు

# ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- 7540 స్వయం సహాయ బృందాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ



**మహబూబాబాద్ బ్యూరో, మే 22(జనం సాక్షి):** మత్తు పదార్థాలు, బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశం ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. సభా ప్రాంగణం లో రెండు పడకల గదుల నిర్మాణం, ఆయిల్ పామ్, వ్యవసాయ, పరిశ్రమలు వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ రెడ్ క్రాస్, చేనేత వస్త్రాల, తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు జిల్లాలో అమలు, జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం పై చర్చ ప్రస్తుతం అలాగే నూతన పథకాలు 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్న విధానంపై సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించడానికి క్షేత్రస్థాయిలో జవాబుదారితనం పారదర్శకతతో కూడిన మెరుగైన పాలనను ప్రజా అభిప్రాయానికి ప్రత్యేకించి నిరుపేద అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సామాజిక న్యాయ ఆర్థిక సాధికారిక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక దరఖాస్తులు డిజిటలైజ్ చేసి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహబూబాబాద్ జిల్లా అన్ని పారామీటర్లలో ముందంజలో ఉందని మరింత అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, (ఇన్చార్జి) అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పిడి హౌసింగ్ జెడ్పి సీఈవో పురుషోత్తం,మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఎస్పీ తిరుపతిరావు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ మున్సిపల్ చైర్పర్సన్లు, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, స్వయం సహాయక బృందాలు, జిల్లాలోని అందరూ ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## పుష్కర స్నానాల్లో పిల్లల ఆధ్యాత్మికత

**కాళేశ్వరం, మే 23 (జనంసాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం నకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వదులుతున్నారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు నది స్నానమాచరించి , సూర్య నమస్కారాలు చేసి , దీపాలు వదులుతుండగా జనం సాక్షి ప్రతినిధి తన కెమెరాలు బంధించారు. తల్లిదండ్రులు చిన్నప్పటినుండే భక్తి భావం అలవాటు చేయడంతో పిల్లలు కూడా పుష్కర స్నానానికి విచ్చేయడం , పూజలు జరపడం పలువురు ఆసక్తిగా తిలకించారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



**వరంగల్ ప్రతినిధి, మే 22(జనంసాక్షి) :** భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి ఉత్సవాలను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిడిఓ భాగ్యలక్ష్మి, మండల పరశురాములు గార్లు పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, బిరు మహేందర్ మొన్నే బాపూరావు కేదాసి మోహన్, ఎలందరు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా

- మంత్రి సీతక్క



**ములుగు ప్రతినిధి, మే 22(జనంసాక్షి) :** జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన టియుడబ్ల్యూజె (ఐజెయు) యూనియన్ కార్యవర్గం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి, మెమొంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో జర్నలిస్టులు ఐకమత్యంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. జర్నలిస్టులో సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. జర్నలిస్టుల ప్రధాన సమస్య అయిన ఇళ్ల స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మంచి శుభవార్త వెలువడనుందని తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ లను మర్యాద పూర్వకంగా కలిసి మెమంటో అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసు, ఉపాధ్యక్షులు బిక్కనూరి సుమన్, చింతల దేవేందర్, ఆలుగొండ రమేష్, ఎనగందుల శంకర్, సునర్కాని శ్యామ్, మల్లేష్, హబీబ్ ఖాన్, కొత్తగట్టు నరసింహచారి, జంపాల శ్యామ్, నాయకపు రాజు, సుంకరి సంపత్ రావు, గాదె సుమన్ వివిధ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# దయనీయంగా ఓ వృద్ధురాలు జీవితం

- గూడు లేక గుడిసెలో కాలం గడుపుతూ..
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటూ..



**కౌటాల మే 22 (జనంసాక్షి) :** ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ చిన్న గుడారం ఏర్పరచుకొని ప్రాణం గుప్పిట్లో కాలం గడుపుతూ జీవిస్తున్న ఓ మహిళ వృద్ధురాలును చూస్తుంటే ఆచార్యం వేస్తుంది. కౌటాల మండలంలోని గురుడు పేట్ గ్రామానికి చెందిన గుర్లే, కమల దగ్గరి బంధువులు దూరమై ఒంటరి జీవితం గడుపుతూ ప్లాస్టిక్ కవర్, కర్రలతో తయారు చేసిన గుడిసెలో జీవిస్తుంది. ఆమె దయనీయ పరిస్థితి చూస్తుంటే ఇంకా ఈ కాలంలో ఇలాంటి వారు కూడా ఉన్నారా ఉంటే ప్రభుత్వం నిరుపేదలకు కల్పిస్తున్న పథకాలు ఎందుకు వర్తించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కులగణన సర్వే చేస్తున్న అధికారుల దృష్టికి..

కులగణన సర్వే లో భాగంగా ఇంటికి వెళ్లిన అధికారులకు ఆ మహిళ అనుభవిస్తున్న జీవితాన్ని చూసి అవాక్కయ్యారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రభుత్వం అనేక సర్వే లు నిర్వహిస్తూనే ఉంది. అలాంటప్పుడు కొన్ని సంవత్సరాలుగా ఒంటరి జీవితం గడుపుతున్న ఆ మహిళ కనబడలేదంటే అధికారుల తీరు ఎలా ఉందో ఇదే సజీవ సాక్ష్యం. ఒక గ్రామంలో ఉంటూ, అడవిలో జీవించినట్లు చిన్న గుడారంలో నరకయాతన అనుభవిస్తుంది. గ్రామంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమలేటర్ దృష్టికి వచ్చిన ఈ ఘటన స్థానికులను సైతం కలచివేసింది. సొంత గూడు లేక ఆదరించే వారు కరువై చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మరిల్లు లాంటి గుడిసెలో ఉంటుంది. కనీసం తాగు నీటి సౌకర్యం,మరుగుదొడ్డి లేదు.

### నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఏది?

ప్రభుత్వం అమలు చేస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులను ఎంపిక కోసం కమిటీలు వేసి పగడ్బందీగా ఎంపిక చేసే వారికి గురుడుపేట గ్రామంలో పూరి గుడిసెలో జీవిస్తున్న కమల లాంటి ఒంటరి మహిళలు కనబడలేదా. అర్హులకు ఎంపిక చేసే సిబ్బంది, కమిటీ విఫలం అయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సర్వే ల హడావిడి తప్ప లబ్ధి దారులకు సహాయం శూన్యం. ఇప్పటి కైన నిర్లక్షం చేసిన సిబ్బంది పై చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### సహాయం కోసం ఎదురు చూపులు

ప్రభుత్వాలు, అధికారులు సహాయం చేయక పోవడంతో స్వచ్ఛంద సంస్థలు, సేవ సంస్థల వారు అయిన ముందుకు వచ్చి సహాయం చేయాలని, మానవ దృష్పథంతో ఆలోసించి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆదుకోవాలని ఒంటరి మహిళా వృద్ధురాలు వేడుకుంటుంది.

## వడదెబ్బతో గిరిజన మహిళ కూలీ మృతి



**గూడూరు, మే 22 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళా కూలీ కొట్టెం భద్రమ్మ 60సం,,లు. గురువారం మిర్చి తోట ఎరడానికి వెళ్లి అస్వస్థకు గురికావడంతో కూలీలు ఆమెను ఇంటికి తరలించారు. స్థానిక వైద్యుల సహాయంతో చికిత్స అందించారు. వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అమలుకున్నాయి. కుమారుడు కొట్టెం నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
23 మే 2026


# జిల్లా సమగ్రాభివృద్ధి సంక్షేమమే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం క్షేత్రస్థాయి అధికారులు సమష్టి ఆలోచనలతో, కలిసికట్టుగా పని చేస్తూ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి నివేదికపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంను శుక్రవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి తోడుగా ఉంటారని భరోసా ఇచ్చారు.గ్రామాల్లో మహిళా సంఘాలకు స్వంత భవనాలు లేకపోతే, సంబంధిత ఎంపీడీఓ ద్వారా తగిన ప్రతిపాదనలు పంపించాలని, అలా వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని అన్నారు.జిల్లాలో ఇప్పటి వరకు 370కి పైగా భవనాల ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 200 మహిళా సంఘ భవనాలకు గ్రౌండింగ్ పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు.క్షేత్రస్థాయిలో మహిళల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో షెడ్స్ నిర్మించుకునే అవకాశం ఉందని, వీటి కోసం కూడా త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు.దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని 50 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రూపొందించిన 342 ప్రత్యేక పరికరాలను అందజేస్తున్నట్లు ప్రకటించారు.ఈ పరికరాలను ప్రత్యేకంగా అలింకో కంపెనీ ద్వారా నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.అనంతరం ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు.మహిళలు, పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్లు, షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు మరింత పటిష్టంగా పనిచేస్తూ బాధితులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.అనంతరం ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు.మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక ఆర్డర్ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.షఫీ ఉల్లా, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డిఎస్సిడిఓ దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



**మునగాల, మే 22 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన జరిగిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ పాల్గొని గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందళాల్ పవార్కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని నర్సింహాపురం నుంచి ఆకుపాముల వరకు గుంతలమయంగా ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని, గతంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలకు కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలకు కేటాయించిన మిగిలిన భూమిని సర్వే చేయించి ఆక్రమణల నుంచి కాపాడాలని, గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయం పేరుతో ఉన్న అన్యాకాంతమైన దేవాలయం భూములు స్వాధీనం చేసుకుని కౌలు ఏర్పాటు చేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని, గత పదిహేను సంవత్సరాలగా అర్హులైన వారికి ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించినట్లు సర్పంచ్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టకొమ్ముగూడెం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



**సంగారెడ్డి టౌన్, మే 22 (జనం సాక్షి) :** చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి లోని గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాలలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా జొన్నల కు ప్రభుత్వం రూ 2699 మద్దతు ధర కల్పించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్ష పాతి అని, రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రతి ఒక్కరు తమ ధ్యానాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మెన్ ప్రభు, సొసైటీ చైర్మెన్ లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నర్సింహ రెడి, నర్సింలు, వెంకటేశం గౌడ్, జాకీర్,ప్రభుదాస్ , విఠల్ రెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత

- బైక్పై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు
- ఒక బైకు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం




**భద్రాచలం, మే 21 (జనంసాక్షి) :** పోలీసులకు బైక్పై గంజాయి తరలిస్తూ పట్టుబడిన సంఘటన భద్రాచలంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై శ్యామ్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... డిఎస్పి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణ ఎస్ ఐ పి.శ్యాం ప్రసాద్ వారి సిబ్బందితో పాటుగా భద్రాచలం ఊరు శివారున ఉన్న కొల్లుగూడెం వెళ్ళు ర్యాంప్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన విక్రం, శంకర్ అను వ్యక్తుల వద్ద నుండి భద్రాచలంకు చెందిన మురళీకృష్ణ, దుమ్ముగూడెం మండలానికి చెందిన గుండి వంశీకృష్ణ, తెల్లం ముఖేష్ అను వారు గంజాయి కొనుగోలు చేసి భద్రాచలంకు తీసుకొని వస్తుండగా కూనవరం రోడ్ వైపు నుండి భద్రాచలం వైపుగా వస్తున్న ఒక మోటార్ సైకిల్ ను వెంబడించి వాహనం పట్టుకొని తనిఖీ చేయగా 2 ప్యాకెట్లలో 12.928 కేజీల బరువు గల గంజాయి రూ. 6,46,400 లక్షల విలువ గల గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి తో పటు ఒక బైకు రెండు సెల్ ఫోన్లు సీజ్ చేసి స్వాధీనం పరుచుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొనగా భద్రాచలం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ వి.సతీష్ కేసు నమోదు చేయగా.. దుమ్ముగూడెం ఇన్స్పెక్టర్ భద్రాచలం ఇంచార్జ్ అయిన వెంకటప్పయ్య వారి ముగ్గురిని రిమాండ్ చేసి జైలుకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేసే వారిపై, గంజాయి త్రాగేవాల్లపై, గంజాయి అక్రమ రవాణాకు సహాయం చేసిన వారి పై చట్టపరమయిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించగలరని, సమాచారం ఇచ్చిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని డి ఎస్ పి అరుణ్ కుమార్ తెలిపారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మే 22 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు శనివారం రోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటన ఏర్పాట్లను శుక్రవారం రోజు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా సాగేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ను సందర్శించి, అక్కడ చేపట్టిన సదుపాయాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి రాకతో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సేవలకు మరో ముందడుగు

- భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కేంద్రం ప్రారంభం



**భువనగిరి, మే 22 (జనం సాక్షి) :** వికలాంగులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందించేందుకు భువనగిరి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్ర భవనాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు వేగంగా చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల ద్వారా దివ్యాంగులు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, రాయితీలు, ప్రయాణ సౌకర్యాలు మరియు ఇతర సేవలను సులభంగా పొందగలరని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కేంద్రం ద్వారా అందించే సేవలను వినియోగించుకొని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కార్యక్రమం గౌడ్లపై పెద్ద కుట్ర



**తుంగతుర్తి, మే 22 (జనం సాక్షి) :** తాడి మ్యూజికాల్ ఫెస్టివల్ కార్యక్రమం గౌడుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామ గౌడ సంఘ సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ తాడి మ్యూజికల్ ఫెస్టివల్ పేరుతో జరుగుతున్న కుట్రను గౌడ సంఘం సభ్యులందరూ వ్యతిరేకించాలని అన్నారు . ఎక్స్పీరియశీ ఈకో పార్క్ యజమాని రామ్ దేవ్ రావ్ ఆధ్వర్యంలో ఈనెల 24 న తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాటి చెట్టు, కల్లుగీత వృత్తి అనేవి గౌడుల జీవనాధారం మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక లేని అన్నారు .ఒకవైపు కల్లుగీత కార్మికులు వృత్తిని కాపాడుకుంటూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుంటే మరోవైపు కార్పొరేట్ వ్యవస్థ తాడి పేరుతో ఈవెంట్లు నిర్వహించి కోట్ల రూపాయల వ్యాపారం చేయాలని చూడడం దారుణమని అన్నారు .కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తాయి అని ప్రశ్నించారు. రామ్ దేవ్ రావ్ పార్కులు అక్రమంగా ఏర్పాటుచేసిన తాడిచెట్ల స్థలాన్ని తాడి కార్పొరేషన్ కు అప్పగించి ట్యాంకు బండి పై ఏర్పాటు చేసుకున్న గౌడ ఆత్మగౌరవ నీరా కేఫ్ కళ్ళు గీత వృత్తిదారులు, కళ్ళు గీత కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో గౌడుల జీవనోపాధికి భరోసా కలుగుతుందని తెలిపారు. ఈనెల 24న జరగబోయే తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. అగ్రకుల కార్పొరేట్ వ్యవస్థాపకుడు రామ్ దేవ్ రావ్ వెనక్కి తగ్గకపోతే రాబోయే కాలంలో గౌడ కుల ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ గౌడ సంక్షేమ కల్లుగీత సంఘ నాయకులు గుండ గాని నాగరాజు గౌడ్, వెలిశాల మల్లేష్ గౌడ్ ,ముత్తయ్య గౌడ్ ,సుధాకర్ గౌడ్, సాగర్ గౌడ్ ,వెంకటయ్య గౌడ్, లింగన్న గౌడ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా స్పా అండ్ మసాజ్ సెంటర్లను నిర్వహిస్తే కఠిన చర్యలు

- డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి



**సికింద్రాబాద్, మే 22 (జనంసాక్షి) :** అక్రమంగా నిర్వహిస్తున్న స్పా అండ్ మసాజ్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో గల స్పా అండ్ మసాజ్ సెంటర్లలో అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హబ్సిగూడ లోని పలు స్పా సెంటర్ల లలో డిసిపి రక్షిత కృష్ణమూర్తి, ఓయూ ఏసీపి జగన్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్పా సెంటర్ లు నిబంధనల ప్రకారం నడుస్తు న్నాయా లేదా అని ఆరాతీశారు. ప్రతి మసాజ్ సెంటర్లో పనిచేసే సిబ్బందికి తగిన సర్టిఫికెట్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే సెంటర్లను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని డీసీపీ స్పష్టం చేశారు.

## అగ్నిప్రమాదంలో జామాయిల్, మామిడి తోటలు దగ్ధం



**ఏరుపాలెం, మే 22 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, తాటిగూడెం రెవెన్యూ పరిధిలోగురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో జామాయిల్, మామిడి తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం ఏడుగురు రైతులకు చెందిన ఆరు ఎకరాల ముప్పై గుంటల జామాయిల్ తోటలు, ఒక ఎకరం ముప్పై గుంటల మామిడి తోట మంటల్లో కాలిపోయాయి.ఈ ఘటనలో జామాయిల్ తోటలకు సుమారు పది లక్షలు, మామిడి తోటకు రెండు లక్షల రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. అగ్నిప్రమాదం కారణంగా పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందంజ

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ఖమ్మం కార్పొరేషన్, మే 22 (జనం సాక్షి) :** ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశుధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య చర్యలతో సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు చెప్పారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అంతకు ముందుకు ఖమ్మం జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను వెల్లడించారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్పర్సన్లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్

## ధర రూ.12 లక్షలు



ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హోండా కార్స్ ఇండియా తన పాపులర్ హై బ్రిడ్ సెడాన్ హోండా సిటీ 2026ని లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను రూ.11.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. మిడ్‌సైజ్ సెగ్మెంట్‌లో ఫోక్స్‌వ్యాగన్ వర్టస్, స్కోడా స్లావియా, హ్యుందాయ్ వెర్నాకు గట్టి పోటీ ఇవ్వ నుంది. హోండా సిటీతో పాటు జడ్ఆర్-వి ఎస్‌యూవీని ఆవిష్కరిం చింది.హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్‌లో ముందు భాగాన్ని పూర్తిగా మార్చేసింది. హనీకూంబ్ తరహాలో ఫ్రంట్ గ్రిల్, లైట్‌తో కూడడిన స్ట్రిప్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేతో కూడిన 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోఇన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, ఫ్రంట్ వెంటిలేటెడ్, 8 స్పీకర్ సిస్టమ్, యాంబియెంట్ లైటింగ్, ఫుట్‌వీల్ లైటింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 360 డిగ్రీ కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులు, హిల్‌హోల్డ్ అసిస్ట్, ంఆయా ఫీచర్లు ఉన్నాయి. ఈ కారులో 1.5 లీటర్ నాచురల్ యాస్పిరేటెడ్ ఇంజిన్ 121ప్తజూ పవర్‌ను, 145ఔఎ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ లేదా సీవీటీ గేర్ బాక్స్‌తో వస్తోంది.2030 నాటికి 10 కొత్త మోడళ్లు: భారత మార్కెట్‌లో 2030 నాటికి ఎలక్ట్రిక్, కాంపాక్ట్ ఎస్‌యూవీ సహా 10 కొత్త మోడళ్లను లాంచ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హోండా ఇండియా వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో పూర్తి ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేయనున్నట్లు తెలిపింది.


# 8000 ఎంఏహెచ్ బ్యాటరీ

## ఎల్‌సీడీ స్క్రీన్‌తో రియల్‌మీ 16

**న్యూఢిల్లీ:**ఒప్పోకు చెందిన సబ్‌బ్రాండ్ రియల్‌మీ కొత్త స్మార్ట్‌ఫోన్‌ను దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. రియల్‌మీ 16ి పేరిట మిడ్‌రేంజ్ ధరలో కొత్త ఫోన్‌ను తీసుకొచ్చింది. 8000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ కెమెరాతో ఈ ఫోన్ తీసుకొచ్చింది. ఏఐ పోర్ట్రెయిట్ గ్లో, ఏఐ ఇన్‌స్టంట్ క్లిప్ వంటి ఏఐ కెమెరా ఫీచర్లను తీసుకొచ్చింది. మూడు రంగుల్లో లభించే ఈ ఫోన్‌ను ఎల్‌సీడీ స్క్రీన్‌తో తీసుకురావడం గమనార్హం.రియల్‌మీ 16ి 6.8 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే తీసుకొచ్చారు. 144 రిఫ్రెష్ రేటు, 1200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐ 7తో పనిచేస్తుంది. 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 852 ప్రధాన కెమెరాతో పాటు 2 ఎంపీ మోనోక్రోమ్ కెమెరా ఇచ్చారు. వెనకవైపు సెల్ఫీ మిర్రర్‌ను కూడా తీసుకొచ్చారు. ముందువైపు పంచ్‌హోల్ డిస్‌ప్లేతో 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇందులోని 8000 ఎంఏహెచ్ బ్యాటరీ 45చి సూపర్‌వూక్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 6.5 వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది.

# శాంతి ఒప్పందంపై ఆశలు

## లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లు లాభపడ్డాయి. దేశీయంగా రూపాయి విలువ బలపడడం, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఓ దశలో 600 పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి మోస్తరు లాభాలకే పరిమితమైంది. నిఫ్టీ 23,700 ఎగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 75,260.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,183.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,810.97 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 231.99 పాయింట్ల లాభంతో 75,415.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.60 పాయింట్ల లాభంతో 23,719.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 63 పైసలు బలపడి 95.73కు చేరింది.సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ఐటీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 105.07 డాలర్ల వద్ద కొనసాగు తుండగా.. బంగారం ఔన్సు 4532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె.. కస్టమర్లకు ఎస్‌బీఐ విజ్ఞప్తి





**దిల్లీ:** ప్రభుత్వరంగ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో సమ్మె నిర్వహించ తలపెట్టారు. ఈ నేపథ్యంలో కస్టమర్లకు ఎస్‌బీఐ విజ్ఞప్తి చేసింది. బ్యాంకింగ్ సేవల కోసం ప్రత్యామ్నాయంగా ఏంటీఎం; కస్టమర్ సర్వీస్ పాయింట్లు; యోనో, యూపీఐ వంటి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలని సూచించింది. బ్యాంకింగ్ వ్యవస్థలో ఐదో వంతు కార్యకలాపాలు ఎస్‌బీఐ ద్వారానే జరుగుతుంటాయి. ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో 52 కోట్ల మంది ఎస్‌బీఐ ఖాతాదారులపై ఈ ప్రభావం పడనుంది. ఖాతాదారులకు అత్యవసర సేవలకు గానూ 23,200 బ్యాంక్ శాఖల్లో అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌బీఐ తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది.5 రోజుల పాటు విరామం: తమ డిమాండ్లు నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో సమ్మె నిర్వహిస్తామని ఆలిండియా ఎస్‌బీఐ స్టాఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని ఉద్యోగులు పేర్కొన్నారు. సరైన సంఖ్యలో ఉద్యోగులు, మెసెంజర్లు, సాయుధ గార్డుల నియామకంతో పాటు ఎన్‌పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ ఎంపికను మార్చడం వంటి వాటిని చేపట్టాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది. శాశ్వత ఉద్యోగాలను పొరుగు సేవలకు అప్పగించడాన్ని ఆపివేయాలని యూనియన్ కోరుతోంది. ఒక వేళ ఈ సమ్మె జరిగితే వరుసగా 5 రోజుల పాటు బ్యాంకులు పనిచేయవు. సమ్మెకు ముందు రోజులు నాలుగో శనివారం, ఆదివారం కావడం, మే 27న (బుధ) చాలా రాష్ట్రాల్లో బక్రీద్ సెలవు కావడం ఇందుకు నేపథ్యం.

# ఏఐ టూల్ చేయించుకొని.. ఆపై లేఆఫ్ వేసి..!

ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన ఉద్యోగుల్లో 10 శాతం మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఈ లేఆఫ్స్‌కి ముందు మెటా తన ఉద్యోగులతో ఏఐ టూల్స్ తయారుచేయించినట్లు తెలుస్తోంది. వారి స్థానంలో ఈ టూల్స్‌ను భర్తీ చేసినట్లు ఆ సంస్థలో పనిచేసి లేఆఫ్‌కు గురైన ఓ ఉద్యోగిని భర్త ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జూలియన్ అనే వ్యక్తి పెట్టిన పోస్టు ప్రకారం.. మెటా కొన్ని నెలల క్రితం కంపెనీలో 'ంఎ లివవఎ'ని నిర్వహించింది. ఆ సమయంలో కంపెనీలోని సాధారణ పనులు చేయడం ఆపేసి.. అంతర్గత ఏఐ టూల్స్ రూపొందించడంపై దృష్టిపెట్టాలని ఉద్యోగులను ఆదేశించింది. ఆ తర్వాత వాటిల్లో కొన్నింటిని ఎంపిక చేసుకొని.. వాటిని మరింత డెవలప్ చేయాలని కోరింది. ఈ టాస్క్‌లో తన భార్య కూడా భాగమైనట్లు జూలియన్ తెలిపారు. ఈ టూల్స్ తమ స్థానాన్ని భర్తీ చేస్తాయేమోనని ఆమె భయపడిందన్నారు. సీనియర్ ఇంజినీర్లతో కలిసి ఒక ఏఐ టూల్‌ను రూపొందించడానికి ఆమె నెలలతరబడి కష్టపడిందన్నారు. చివరికి తాజాగా కంపెనీ ప్రకటించిన లేఆఫ్‌లలో తన భార్య ఉద్యోగం కోల్పోయిందన్నారు. ఈ ఏఐ టూల్స్ నిర్మించడంపై మెటా నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఏఐ యుగంలో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ఇది ఒక హెచ్చరికగా నెటిజన్లు అభివర్ణిస్తున్నారు.


**సంతోషంగా ఉంది..**

ఇదిలాఉండగా.. మెటా తనను ఉద్యోగం నుంచి తొలగించడంపై శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఆశా రావల్ అనే మహిళ ఆనందం వ్యక్తంచేశారు. ఆశా రావల్ 2022 నుంచి మెటాలో ప్రొడక్ట్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన లేఆఫ్స్‌లో ఆమె కూడా ఉద్యోగం కోల్పోయారు. ఇందుకు తాను బాధపడటం లేదని.. పైగా చాలా సంతోషంగా, స్వేచ్ఛగా అనిపిస్తుందంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియో కూడా ప్రస్తుతం వైరల్ అవుతోంది.





# కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ బంపర్ డివిడెండ్

**ముంబయి:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది.ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు-కమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు-తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.




# ఆఫ్రికా నెత్తిన ఎబోలా కుంపటి

## తలనొప్పిగా మారిన వైరస్ కట్టడి..!



**జనంసాక్షి:**ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్ర కలకలం సృష్టిస్తోంది వైరస్‌తో పాటు తప్పుడు సమాచార వ్యాప్తి ఇక్కడి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మృతదేహాన్ని అప్పగించలేదని ఎబోలా చికిత్సా కేంద్రానికి స్థానికులు నిప్పంటించడం అందుకు ఉదాహరణ. ప్రస్తుత వ్యాప్తికి కేంద్రంగా ఉన్న కాంగోలోని ర్వాంపారా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వైరస్ ప్రతిస్పందన విషయంలో ప్రజల్లో నెలకొన్న అపనమ్మకం, ఆగ్రహం ఈ పరిస్థితికి కారణమైంది.1976లో కాంగోలో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించగా, ఇప్పుడు 17వసారి వ్యాప్తి చెందుతోంది. పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా ఆమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని పేర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊూ).. గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ (ఉశ్రీనీఎజీశ్రీ ఇఎవతీణవనిఇ-ఎ)ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో వైరస్ కట్టడికి వైద్య సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, కాంగో తరహా ఘటనలు వారికి తలనొప్పిగా మారాయి.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఎబోలా లక్షణాలతో ఓ వ్యక్తి మృతిచెందగా, అతని మృతదేహాన్ని అప్పగించేందుకు వైద్య సిబ్బంది నిరాకరించడం స్థానిక యువత ఆగ్రహానికి గురైంది. దీంతో వారు వైద్య కేంద్రంలోకి చొరబడి, నిప్పంటించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రజారోగ్య చర్యలు, స్థానిక సంప్రదాయాల మధ్య సమతుల్యతను పాటించడం క్లిష్టంగా మారిందని, అదే ప్రజల్లో అపనమ్మకానికి కారణమని అధికారులు వెల్లడించారు.

**బుష్‌మీట్..అంత్యక్రియలు:**మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వైరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు చేరుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి లక్షణాలు తొలుత




కనిపించినా.. చివరకు అవయవాలు వైఫల్యానికి దారితీయొచ్చు. కొన్ని కేసుల్లో శరీరం లోపలా, బయటా రక్తస్రావం అవుతుంటుంది. వైరస్ సోకిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకూ వ్యాపిస్తుంది.ఇలాంటి పరిస్థితుల్లో ఆ వైరస్ లక్షణాలతో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పీపీఈ కిట్లు ధరించిన ప్రత్యేక బృందాలు ఖననం చేయాలని అంతర్జాతీయ వైద్య సంస్థలు ఇప్పటికే స్పష్టమైన సూచనలు ఇచ్చాయి. కానీ, ఆఫ్రికా దేశాల్లో అంత్యక్రియలను సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భారీగా జనం గుమిగూడి, మృతదేహాన్ని తాకుతారు. దీనివల్ల వైరస్ సోకే ముప్పు అధికమవుతోందట. ర్వాంపారా ఘటనకూ ఇదే కారణమని స్థానిక అధికారులు వెల్లడించారు.బుష్‌మీట్, అంత్యక్రియలు, తప్పుడు సమాచారం ఆఫ్రికాలో ఎబోలా వ్యాప్తికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నమోదవుతోన్న కేసులన్నీ బండిబుగ్యో ఎబోలా రకానివే. బండిబుగ్యో స్ట్రెయిన్ కట్టడికి ఆమోదించిన టీకాలు ఏవీ అందుబాటులో లేవు. కొన్ని నెలల్లో మానవులపై ప్రయోగాలు జరగొచ్చని తెలుస్తోంది.

# మహారాష్ట్రలో విషాదం

## చంద్రాపూర్ అటవీ ప్రాంతంలో మాటువేసి పులి దాడి ఘటనలో నలుగురు మహిళలు మృతి

చంద్రాపూర్(జనంసాక్షి):అడవిలో బీడీ ఆకులు ఏరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలపై ఒకేసారి పులి దాడి చేసి చంపింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఈ భయానక ఘటన చోటుచేసుకొంది. ఉదయం పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజలు ఎండిపోయిన బీడీ ఆకులు ఏరుకొనేందుకు అటవీ ప్రాంతంలోకి వెళ్లడం అక్కడ సర్వసాధారణం. శుక్రవారం ఉదయం కూడా ఆ ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు వెళ్లారు. దాదాపు ఉదయం 8 గంటల సమయంలో ఓ పులి వారిపై దాడి చేసింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బాధితులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా అది భయంకరంగా విరుచుకుపడింది. దీంతో ఘటనా స్థలంలోనే నలుగురు మహిళలు ప్రాణాలు విడిచారు. మృతులను కవుదుబాయి దాదాజీ మొహర్లే, అనుబాయి దాదాజీ మొహర్లే, సంగీతా సంతోష్ చౌదరీ, సునీతా కౌశిక్ మొహర్లేగా గుర్తించారు. వీరంతా 33 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్యవారే. ఈ ఘటన తర్వాత అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఫారెస్ట్ రేంజి అధికారి అంజలీ సాయంకర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఒకేసారి పులి దాడిలో నలుగురు మహిళలు చనిపోవడంతో గ్రామీణుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# ఉమర్ ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):2020 నాటి దిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయి జైలులో ఉన్న జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. ఖాలిద్ తల్లికి శస్త్రచికిత్స జరగనున్న నేపథ్యంలో ఆమెను కలిసేందుకుగాను అతడికి దిల్లీ హైకోర్టు అనుమతిచ్చింది.

# రూపాయి విలువ తగ్గనీయండి

## అరవింద్ పనగారియా

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో రూపాయి విలువ రోజురోజుకు పతనమవుతోంది. ఈ క్రమంలోనే నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కీలక సూచనలు చేశారు. చమురు కొరత స్వల్పకాలికమైనా.. దీర్ఘకాలికమైనా రూపాయి విలువ తగ్గాల్సిందేనన్నారు. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకుంటుందని పేర్కొన్నారు. రూపాయి విలువ తగ్గితే దిగుమతులకు అయ్యే ఖర్చు పెరిగినప్పటికీ.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుందని.. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో గణనీయంగా కోలుకుంటుందని అరవింద్ పనగారియా పేర్కొన్నారు. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే.. భారత విదేశీ మారక నిల్వలను హరించివేస్తుందని హెచ్చరించారు. రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుందని తెలిపారు. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధారపడకూడదని ఆర్‌బీఐకి సూచించారు. వాటిని తాత్కాలిక, ఖరీదైన చర్యలుగా అభివర్ణించారు. 2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే.. నేడు భారతదేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని పనగారియా పేర్కొన్నారు. 2013లో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం ఆర్‌బీఐ చేపడుతున్న మెరుగైన ద్రవ్య నిర్వహణ చర్యల వల్ల ద్రవ్యోల్బణ స్థాయిలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.




# కూల్‌కూల్‌గా..

- భానుడి భగభగలకు అడ్డుచక్రం
- భూగోళాన్ని చల్లబరిచే సాంకేతికత
- అభివృద్ధి చేస్తున్న అమెరికా-ఇజ్రాయెల్ స్టార్టప్

**జనంసాక్షి:**ఓ వైపు ఎండల మంట... మరోచోట కరవుకాటకాలు... ఇంకో ప్రాంతంలో కార్చిచ్చులు.. భూతాపం దుష్పరిణామాల్ని నేటి ప్రపంచం కళ్లారా చూస్తోంది. ఈ విపత్తుల నుంచి మానవాళిని ఎలా కాపాడుకోవాలి? భూమిని చల్లబరచడానికి ఏం చేయాలి? తీక్షణ సూర్యకిరణాల్ని అడ్డుకోగలిగితే ఈ విపత్తుల్నినివారించొచ్చు కదా!! ఈ దిశగానే ఆలోచించింది ఓ జియో ఇంజినీరింగ్ సంస్థ. భూగ్రహాన్ని చల్లబరిచే ప్రణాళికలను అది తాజాగా తెరపైకి తెచ్చింది. ఆ సంస్థ పేరు స్టార్‌డస్ట్ సొల్యూషన్స్. ఇది అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త స్టార్టప్. సూర్యకిరణాలు భూమిని తాకక ముందే వాటికి అంతరాయం కలిగించే విధంగా మేఘాలను మార్చడం లేదా వాతావరణంలోని ఇతర లక్షణాలను సవరించడం స్టార్‌డస్ట్ ప్రాజెక్టులో కీలకాంశం. అంతరిక్షంలో భారీ సన్ షేడ్లను నిర్మించడం లేదా సముద్రాలు గ్రహించే వేడి పరిమాణాన్ని పరిమితం చేయడం, కాంతిని పరావర్తనం చెందించే సముద్రపు నురగతో బుడగల్లాంటి మిశ్రమాలను సృష్టించడం వంటి ఇతర ఆలోచనల్నీ సంస్థ చేస్తోంది. ఇందు కోసం ఇసుక రేణువుల కంటే 125 రెట్లు చిన్నవైన ఏరోసోల్ కణాలను ఉపయోగించబో తోంది. ఆ కణాల కూర్పునూ సంస్థ తాజాగా వెల్లడించింది. అవి 'అమార్ఫస్ సిలికా' అని పిలుచుకునే పదార్థంతో తయారయ్యాయి. ఇవి కేవలం మైక్రోస్కోప్‌తో మాత్రమే కనిపించే 0.5 మైక్రాన్ల పరిమాణంలో ఉంటాయి. ఈ గోళాకార సిలికా కణాలను భూమికి సుమారు 11 మైళ్ల ఎత్తులో భూవాతావరణంలో రెండో పొర అయిన స్ట్రాటోస్ఫియర్‌లో వెదజల్లుతారు. సూర్యకిరణాల తీక్షత నేరుగా భూమిని తాకకుండా చేయడం దీని ఉద్దేశం. ఇలా వెదజల్లిన సిలికా కణాలు తిరిగి భూమిపైకి పడుతున్నప్పుడు వాటిని పర్యవేక్షించే వ్యవస్థల్నీ స్టార్‌డస్ట్ సంస్థ తయారు చేస్తోంది. అయితే ఇలా సూర్యకిరణాల్ని




అడ్డుకోవడం అత్యంత ప్రమాదకరం అనే దానిపై పెద్ద చర్చే నడుస్తోంది.స్టార్‌డస్ట్ రెండు రకాల అమార్ఫస్ సిలికా ఆధారిత కణాలను అభివృద్ధి చేస్తోంది. వాటిలో ఒకటి పూర్తిగా జీవ సురక్షితం. ధ్రువీకరణలో చాలా ముందంజలో ఉంది. సిలికా కణం మరో వెర్షన్‌లో కాల్షియం కార్బొనేట్ కోర్ ఉంటుంది. ఇది సౌర వికిరణాన్ని మరింత సమర్థంగా అడ్డుకుంటుంది. స్ఫటికాకార సిలికా కంటే.. అస్ఫటికాకార సిలికాకు భిన్నమైన పరమాణు నిర్మాణం ఉంటుంది. స్టార్‌డస్ట్ తన ప్రయోగంలో అస్ఫటికాకార సిలికానే ఉపయోగిస్తోంది. దీనివల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు ఉండదని డబ్ల్యూహెచ్ఓ క్యాన్సర్ పరిశోధన సంస్థ చెబుతోంది. భూవాతావరణాన్నే సమూలంగా మార్చేసే ఈ ప్రాజెక్టు ప్రమాదకరమని సోలార్ జియోఇంజినీరింగ్ నిపుణులు, పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. సూర్య కిరణాలను అడ్డుకోవడం అంటే మానవాళి మనుగడనే ప్రమాదంలోకి నెట్టడమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. స్టార్‌డస్ట్ తమ సొంత ప్రమాణాల ప్రకారం భద్రతను నిర్వచించి, వాటిని తాము పాటిస్తున్నామని స్వీయ ధ్రువీకరణ తీసుకోలేదని, ఈ రంగానికి సమన్వయంతో కూడిన, చట్టబద్ధమైన, స్వతంత్ర పరిశోధన అవసరమని అలయన్స్ ఫర్ జస్ట్ డెలిబరేషన్ ఆన్ సోలార్ జియోఇంజినీరింగ్ కార్యనిర్వాహక డైరెక్టర్ శుచి తలాటి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకు ఏ దేశాలు లేదా సంస్థలు అనుమతి ఇస్తాయి? దాన్ని ఎక్కడెక్కడ అమలుచేస్తారు? స్టార్‌డస్ట్ ప్రణాళికలపై సమగ్ర అధ్యయనం జరుగుతోందా? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానాల్లేవు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టు పేరిట స్టార్‌డస్ట్ సొల్యూషన్స్ 2023 నుంచి పెట్టుబడిదారుల నుంచి కోట్లకొద్దీ డాలర్లను సమీకరిం చింది. భూమిని చల్లబరచడానికి స్టార్‌డస్ట్ లాంటి కంపెనీలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ.. శిలాజ ఇంధనాలను మండించడమనే మూలకారణాన్ని మాత్రం అవి పరిష్కరించలేవు. దేశాలు చమురు, గ్యాస్, బొగ్గు వినియోగాన్ని సురక్షిత స్థాయికి తగ్గించడంతో పాటు.. గాలి, సముద్రాల నుంచి అధిక వాతావరణ కాలుష్యాన్ని తొలగించే వరకు ఈ సమస్య అంత సులువుగా పరిష్కారం కాదు. సూర్యరశ్మి తీక్షణతను అడ్డుకోగలిగే సాంకేతికతలోని అన్ని సవాళ్లకు, ఆందోళనలకు మేం పటిష్టమైన, శాస్త్రీయ పరిష్కారాలను అందిస్తాం. ఈ సాంకేతిక సురక్షితమైనది, ఆచారణాత్మకమైనది, నియంత్రించదగినదని నిరూపిస్తే ప్రభుత్వాలు దాన్ని పరిగణనలోకి తీసుకుంటాయి.








(a) And it is hereby declared that the mortgagee, shall be free to complete the said works the amount so realized and the mortgagor, shall not be entitled to question the unfettered right of mortgagee in any court of law.
(b) If additional amounts for execution of the said works over and above the sale proceeds referred to in the above para it shall be realized from the 'Mortgagor' or the purchaser of individual plots in the said layout area in the same manner as property tax and the other plots not covered by the mortgagee will be under the first charge towards the said excess amount spent by the Gram panchayath.
The MORTGAGEE is the executive AUTHORITY/Panchayat Secretary G.P.KONDURG (EAST) Village, KONDURG G.P., KONDURG Mandal, Ranga Reddy District, I do hereby undertake to permit the mortgagor to sell the mortgaged property i.e. Open Plot Nos. 96 (146.67), 97 (173.11), 98 (276.67), 99 (165.00), 100 (165.00), 103 (200.00), 105 (165.00), 106 (165.00), 107 (317.67), 108 (266.89), 110 (183.33), 111 (183.33), 113 (222.22), 114 (222.22), 115 (183.33), 116 (183.33), 117 (183.33), 118 (183.33), 119 (306.56), 120 (396.33), and 123 (242.89) total an extent of 4531.21 Square yards or equivalent to 3788.54 Square Meters, covered in Sy.No.10/P, 13/P, (T.L.P.No.336/2021/H), Situated at "SREE RUGVEDA SREE AMBIKA" KONDURG (EAST) Village, KONDURG G.P.,Kondurg Mandal, Ranga Reddy District, T.S.after complying the terms and conditions as laid in the proceeding issued by the DTCP authority

SCHEDULE OF THE PROPERTY

All that the Open Plot Nos. 96 (146.67), 97 (173.11), 98 (276.67), 99 (165.00), 100 (165.00), 103 (200.00), 105 (165.00), 106 (165.00), 107 (317.67), 108 (266.89), 110 (183.33), 111 (183.33), 113 (222.22), 114 (222.22), 115 (183.33), 116 (183.33), 117 (183.33), 118 (183.33), 119 (306.56), 120 (396.33), and 123 (242.89) total an extent of 4531.21 Square yards or equivalent to 3788.54 Square Meters, covered in Sy.No.10/P, 13/P, (T.L.P.No.336/2021/H), Situated at "SREE RUGVEDA SREE AMBIKA" KONDURG (EAST) Village, KONDURG G.P.,Kondurg Mandal, Ranga Reddy District, T.S.and registration jurisdiction of SRO FAROOQNAGAR, and District Registration Ranga Reddy Dist., Telangana state. Bounded by:

Others Land
Plot No.89
Plot No.101
33'0" Wide Road
Plot No.105, 106 and 107

For TRISHAKTHI LAND MANAGEMENT LLP
Authorised Signatory

Panchayat Secretary
G.P. Kondurg
Md: Kondurg, Rangareddy Dist:

Contd..5







# దిగొచ్చిన త్రిశక్తి వెంచర్ యాజమాన్యం

## త్రిశక్తి వెంచర్ మోసాలపై 'జనంసాక్షి' వరుస కథనలు

- పక్క ఆధారాలతో సంచలనం సృష్టించిన జనంసాక్షి
- గ్రామపంచాయతీకి 15% మార్టిగేజ్ ప్లాట్ల అప్పగింత

**రంగరెడ్డి జిల్లా ప్రతినిధి/ కొందుర్గు/(జనంసాక్షి) :** మండల కేంద్రంలో వెలిసిన 'త్రిశక్తి వెంచర్' అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై 'జనంసాక్షి' దినపత్రిక ప్రచురించిన వరుస పరిశోధనాత్మక కథనాలకు ఎట్టకేలకు అధికారులు, వెంచర్ యాజమాన్యం దిగొచ్చాయి. నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీకి అప్పగించాల్సిన 15 శాతం మార్టిగేజ్ (తనాఖా) ప్లాట్లను వెంచర్ యాజమాన్యం ఎట్టకేలకు పంచాయతీ కి అప్పగించింది. 'జనంసాక్షి' కథనాలతో కదలిన త్రిశక్తి వెంచర్ నిర్వాహకులు నిబంధనలను గాలికి వదిలేసి, ఎలాంటి కనీస వసతులు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు జరిపారని 'జనంసాక్షి' పక్క ఆధారాలతో సహా వరుస కథనాలను ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టడంతో, తప్పు నిజమేనని అధికారులు అంగీకరించక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే TLP No: 336/2021/H పరిధిలోని 15 శాతం మార్టిగేజ్ ప్లాట్లను గ్రామపంచాయతీ కి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గ్రామపంచాయతీకి మార్టిగేజ్ చేసిన ప్లాట్ల వివరాలు: వెంచర్ నిబంధనల ప్రకారం కింది నెంబర్లు గల ప్లాట్లను గ్రామ పంచాయతీకి మార్టిగేజ్ (తనాఖా) చేశారు: ప్లాట్ నెంబర్లు: 96, 97, 98, 99, 100, 103, 105, 106, 107, 108, 109, 110, 111, 113, 114, 115, 116, 117, 118, 119, 120, 123

**లేని అనుమతులు!**

ఈ వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన మరియు విస్తుగొలిపే అంశం ఏమిటంటే, ఈ వెంచర్‌కు ఇప్పటివరకు పూర్తిస్థాయి అనుమతులు (Final Layout Approval) లభించలేదు. అంతేకాకుండా, లేఅవుట్ రిన్యువల్ చేసుకోవాల్సిన సమయం ఎప్పుడో ముగిసిపోయినప్పటికీ, యాజమాన్యం ఇప్పటివరకు రిన్యువల్ చేసుకోలేదు. పూర్తి అనుమతులు లేవు, రిన్యువల్ గడువు ముగిసింది.. అయినప్పటికీ యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు జరపడం వెనుక వెంచర్ యాజమాన్యానికి, కొందరు స్థానిక అధికారులకు మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలే కారణమనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్షలాది రూపాయలు పోసి ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్య ప్రజలు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "ప్లాట్ కొని మూడేళ్లు దాటుతున్నా వెంచర్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించలేదు. ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు రావడం లేదు" అని బాధితులు (ఈరపురం అశోక్ గౌడ్, మంగళ అనిల్ కుమార్) (మొద్దు రాఘవేందర్) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా, రిన్యువల్ చేయకుండా విక్రయాలు జరిపిన త్రిశక్తి వెంచర్ యాజమాన్యంపై మరియు వారికి సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కొందుర్గు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జవహర్‌నగర్‌లో దారుణ హత్య

- ఇంట్లో కుళ్లిన స్థితిలో పెయింటింగ్ కాంట్రాక్టర్ మృతదేహం..
- కర్రతో హత్య చేసినట్లు అనుమానం

జవహర్‌నగర్, మే 22 : (జనంసాక్షి )జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంబేద్కర్ నగర్‌లోని దొండతోట కాలనీలో ఓ ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన పోలీసులు మధ్యాహ్నం సుమారు 12:35 గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించగా, అక్కడ ఓ వ్యక్తి కుళ్లిపోయిన స్థితిలో మృతదేహంగా కనిపించాడు. వెంటనే క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో మృతుడు చెక్క కర్రతో దాడికి గురై మృతి చెందినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని అనిల్ కుమార్ (43)గా గుర్తించారు. ఇతను అనంత్ లాల్ కుమారుడు కాగా, వృత్తిరీత్యా పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం సాయిబాబా కాలనీ, దొండతోట సమీపం, అంబేద్కర్ నగర్, కాప్రాలో నివాసం ఉంటున్నాడు. ఇతని స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్‌గా పోలీసులు వెల్లడించారు. ఇంటి యజమాని అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ధాన్యం అమ్మకానికి రైతుల పాట్లు...

# కిలోమీటర్ల మేర ట్రాక్టర్ల క్యూ

- తెల్లవారుజాము నుంచే ధాన్యం కేంద్రం వద్ద బారులు
- మారుతి ఇండస్ట్రీస్ వద్ద రైతుల కష్టాలు: ధాన్యం అమ్ముడుపోక అవస్థలు
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని తిప్పలు



**యాలాల మే 22 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌లోని మారుతి ఇండస్ట్రీస్ దగ్గర ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతుల ట్రాక్టర్లు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఉదయం 6 గంటల నుంచే రైతులు క్యూ లైన్లలో వేచి ఉన్నారు. కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండటంతో ఒక్కో ట్రాక్టర్‌కు రోజుల తరబడి సమయం పడుతోంది. దీంతో ట్రాక్టర్ అద్దె, కూలీల ఖర్చులు భారంగా మారాయని, రాత్రింబవళ్లు పొలంలో కాపలా కాసి పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేక అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి, టోకెన్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే తమకు ఉపశమనం కలుగుతుందని వారు కోరుతున్నారు.

# సురక్షిత ఆహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- శేరిలింగంపల్లి జోన్‌లో ఫుడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం
- 110 స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు హైజిన్ కిట్లు
- ఫుడ్ సేఫ్టీ సూపర్‌వైజర్ కోర్సు పూర్తి
- నెస్లే, స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ సహకారం



**శేరిలింగంపల్లి, మే 22 (జనంసాక్షి):** ఆహార భద్రతా నియమాలతో పాటు, సురక్షిత ఆహారం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ సూచించారు. శేరిలింగంపల్లి జోన్ ఫుడ్ సేఫ్టీ అధికారులు, స్ట్రీట్ ఫుడ్ వెండర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 ప్రకారం పాటించాల్సిన నియమాలను, విధివిధానాలను జెడ్సి సమావేశంలో వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు, స్ట్రీట్ ఫుడ్ వెండర్ల మధ్య అవగాహన ఏర్పడడంతో పాటు సురక్షిత ఆహారం, ఆహార భద్రత, పరిశుభ్రత, నిర్వహణ పద్ధతులపై ప్రతి ఒక్కరికీ మంచి అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఎక్కడ ఆహార కల్తీ, అపరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఉదాసీనతను సహించబోమని, తమ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు స్ట్రీట్ ఫుడ్ వెండర్లు తప్పనిసరిగా వారికి సహకరించి తగిన శాంపిల్స్ అందించడంతోపాటు పాటించాల్సిన నిబంధనల విషయంలో చిన్న చిన్న పొరపాట్లను సైతం సీరియస్‌గా పరిగణించడం జరుగుతుందని హెచ్చరించారు.
ఈ అవగాహన కార్యక్రమంలో 110 మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లు పాల్గొనడం జరిగిందని, అలాగే వీరంతా ఫుడ్ సేఫ్టీ సూపర్‌వైజర్ కోర్సును దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందని అధికారులు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారికి హైజిన్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని జెడ్సి తెలిపారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహిస్తూ పాటించేలా చేయడమే తమ ఉద్దేశమని, ఈ కార్యక్రమాన్ని నెస్లే ఇండియా మరియు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కొనసాగించినట్లు శేరిలింగంపల్లి జోన్ అధికారులు తెలియజేశారు.

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### డిసిఓ రామ్మోహన్ రావు

**భిక్కనూరు మే 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భిక్కనూరు పరిధిలోని పిపిసి భిక్కనూరు సెంటర్‌ను డిసిఓ రామ్మోహన్ రావు సందర్శించారు, వరిధాన్యం కొనుగోలు విషయమై రికార్డులను పరిశీలించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తేమ శాతం వచ్చిన కుప్పలను కాంట చేయాలని ఆదేశించారు. అలాట్మెంట్ ఇచ్చిన రైస్ మిల్లులకు మాత్రమే వరిధాన్యం పంపించాల్సిందిగా సూచించారు. వర్షాలు పడే సూచన ఉన్నందున రైతులకు వడ్ల కుప్పల పైన టార్పాలిన్ కప్పుకోవాల్సిందిగా సూచించారు, రైతులకు మౌలిక వసతులు కల్పించాల్సిందిగా ఆదేశించారు, ట్యాబ్ ఎంట్రీని కూడా త్వరగా పూర్తి చేయుటకు ఆదేశించారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు



**కామారెడ్డి ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** సామాజిక సంస్కర్త, దళితోద్యమ ప్రముఖ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన గావించి, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని అన్నారు. విద్య, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యే ప్రధాన ఆయుధమని భావించి, వారికి చైతన్యం కల్పించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లయ్య చెరువు మట్టి అక్రమాలు


- నిబంధనలు పక్కనబెట్టి ప్రైవేటు దందా
- రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన మట్టి.. వ్యాపారానికి మళ్లింపు
- మామూళ్ల మత్తులో అధికారులు... ప్రశ్నిస్తున్న ప్రజలు



**బాన్సువాడ మే 22 (జనం సాక్షి) :** బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువులోని పూడిక మట్టి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. రైతుల వ్యవసాయ అవసరాల కోసం ఉచితంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం అనుమతించిన చెరువు మట్టిని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు అవసరాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చెరువు మట్టిని కేవలం వ్యవసాయ భూముల సారాన్ని పెంచేందుకు మాత్రమే ఉపయోగించాలి. ఇందుకు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా గ్రామపంచాయతీ ద్వారా అనుమతి తీసుకోవడం తప్పనిసరి. అయితే బాన్సువాడలో ఈ నిబంధనలు అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
వాణిజ్య అవసరాలకు మట్టిని తరలించాలంటే నీటిపారుదల, రెవెన్యూ, స్థానిక సంస్థల అనుమతులు అవసరం కాగా, అవి లేకుండానే భారీగా మట్టి రవాణా జరుగుతుందని సమాచారం. ప్రతి వాహనానికి రసీదు, ఫోటోగ్రఫీ వంటి నిబంధనలు ఉన్నప్పటికీ, అవి కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువులో జేసీబీలతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువు కట్టలు బలహీనపడే ప్రమాదం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అక్రమంగా మట్టిని తరలించి వ్యాపారం చేస్తే "మట్టి మాఫియా" కింద కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రభావవంతమైన వ్యక్తులు అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుని, జరుగుతున్న అక్రమాలు బయటపడకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు మట్టి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు నిజంగా లబ్ధి చేకూరేలా పారదర్శకంగా మట్టిని పంపిణీ చేయాలని కోరుతున్నారు. నిబంధనలు ఉన్నా అమలు లేకుంటే ప్రయోజనం ఉండదని, సహజ వనరుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ప్రజా సమస్యలు త్వరితంగా పరిష్కరించాలి



**కరీంనగర్ బ్యూరో, మే 22 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మీశ్రా అన్నారు. జిల్లాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమర్థవంతంగా జరుగుతోందని, క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ చిత్రా మీశ్రా మాట్లాడుతూ, మొత్తం 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా 10 అంశాలతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రతి గ్రామం పర్యటించి ప్రజలతో మమేకమయ్యారని, వారి సమస్యలు తెలుసుకున్నారని, అవసరాలను గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.
నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడం, చైతన్యపరచడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని అన్నారు. సుమారు 1500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, 66 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం ద్వారా సానిటేషన్‌ను మెరుగుపరిచామని తెలిపారు. రానున్న రోజుల్లో కొత్తగా నగరంలో కలిసిన పరిసర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెడతామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డీఓలు మహేశ్వర్, రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ప్రజా సమస్యలు త్వరితంగా పరిష్కరించాలి



**శామీర్‌పేట, మే 22 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా, పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముందుకెళ్లడమే జిల్లా యంత్రాంగం ముఖ్య ఉద్దేశమని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట్ మండలంలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద్ కన్వెన్షన్ హాల్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు. బీసీ మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధి ముఖ్య ఉద్దేశ్యంగా ప్రభుత్వం ఆలోచన విధానంతో పథకాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు.
ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు సాధిస్తున్న విజయాలను వివరించారు. కుటీర పరిశ్రమలుగా మొదలై హైదరాబాద్ శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాటు చేసుకుని లాభాలు ఆర్జించే స్థాయికి ఎదిగారన్నారు. పేదరికం, నిరుద్యోగం వంటి అవరోధాలను అధిగమిస్తూ అన్ని రంగాల్లో మహిళలు ఉన్నతంగా ఎదగడానికి ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. మరోవైపు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, ధాన్యం కొనుగోలు వరకు రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ మొదటి విడత పూర్తి చేసుకుని, రెండవ విడత వైపు అడుగులేస్తోందన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అడిషనల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ చంద్రావతి, ఆర్‌డీఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, జిల్లా గ్రంథాల య చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్‌టీఏ నెంబర్ జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, ముడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, ఎల్లంపేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడి లేని వాతావరణంలో చదువుకోవాలి

- ట్రాఫిక్ రద్దీతో మానసిక ఒత్తిడి.. 526 విద్యాసంస్థల్లో సర్వే
- లాంగ్ టర్మ్ సొల్యూషన్స్..పోలీసులు-అధికారుల సమన్వయం అవసరం




**శేరిలింగంపల్లి, మే 22 (జనంసాక్షి):** సమాజంలో మారుతున్న కాలానుగుణ స్థితిగతులవల్ల నగరం పరిధిలో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోందని, దాని ప్రభావం వివిధ స్థాయిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై పడి వారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ విభాగం మరియు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సిఎస్సి) సంయుక్తంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 526 విద్యాసంస్థల్లో 4 లక్షలకు పైగా విద్యార్థులను సంప్రదించి విద్యా విధానంలో ఉన్న గ్యాపులను అడిగి తెలుసుకోవడం జరిగింది.
ఈ సమావేశంలో సైబరాబాద్ కమిషనరేట్ సీనియర్ పోలీస్ ఉన్నతాధికారులు, విద్యా శాఖ నుండి జిల్లా విద్యాశాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం నుండి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానం ఎంతో మానసిక ఒత్తిడితో కూడుకొని కొనసాగుతోందని, 15 మినిట్ విండోలో పీక్ స్కూల్ హవర్‌లో కనీసం రెండు లక్షల వాహనాలు వివిధ విద్యాసంస్థల నుండి బయటకు వస్తుండడం, అదే సమయంలో ఐటీ కారిడార్‌లో సైతం ఉద్యోగుల రద్దీ నెలకొని ఉండడంతో ప్రయాణికులు సహా అన్ని వర్గాల ప్రజలు నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కి నరకం చూస్తున్నారని వివరించారు.
దీంతో ఒకవైపు ఉద్యోగ జీవితం, మరోవైపు పిల్లల విద్యా విషయాలతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్న తల్లిదండ్రులు ప్రతినిత్యం తమ పిల్లలను ఆయా విద్యాసంస్థల నుండి ఇంటికి తీసుకొని రావడానికి అనేక పొరపాటు మార్గాలను అనుసరిస్తూ ఇబ్బందుల్లోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు.
ఈరోజు జరిగిన కార్యక్రమం ఒక ట్రాన్స్‌పోర్ట్ సమస్యకు సంబంధించిన విషయం కాదని, ఇదొక దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించేందుకు నాంది లా మొబిలిటీ విధానం ఆవిష్కృతం కావాలని ఆయన ఆకాంక్షించారు. జీహెచ్ఎంసి నుండి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, సీఎంసీ అధికారుల నుండి సైతం సైబరాబాద్ పోలీస్ విభాగానికి సంపూర్ణ మద్దతు లభిస్తుందని, విద్యార్థుల భద్రత విషయంలో, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ విషయంలో తప్పకుండా వారి పూర్తి సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సిఎస్సి సంస్థ ప్రతినిధులు, టీజీఎస్ఆర్టీసీ నుండి డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి, మండల విద్యాశాఖ అధికారి రామారావు, సైబరాబాద్ పోలీస్ విభాగం ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
23 మే 2026

# వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆందోళన
- నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్‌గా మార్చి దోపిడీ
- తాలు, తరుగు పేరిట రైతుల నడ్డి విరుచుతున్న దళారులు
- ప్రతి గింజను కొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే



**కరీంనగర్ అర్బన్, మే 22 (జనంసాక్షి):** వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించకపోవడం, ప్రారంభించిన కొనుగోళ్లు సాగడంతో రైతులు వారాల తరబడి మార్కెట్ యార్డుల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అదునుగా భావించిన దళారులు, కొంతమంది అధికారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.
ముఖ్యంగా నాణ్యమైన వడ్ల పంటను సైతం ఏ గ్రేడ్ నుంచి బి-గ్రేడ్‌కు మార్చడం, తాలు, తరుగు పేరిట కోతలు విధించి రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు అహోరాత్రులు శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు కేంద్రాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, కూలీల కొరత, సంచుల కొరత, రవాణా వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.
రైతుల ప్రయోజనాలను కాపాడటానికి భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో అలుపెరగని కృషి చేస్తుందని, వడ్లు, మొక్కజొన్న చివరి గింజ కొనే వరకు బీజేపీ విశ్రమించదని హెచ్చరించారు. అనంతరం వడ్లలో బి-కేటగిరి దోపిడీని అరికట్టాలని, సంచులు, రవాణాలో అదనపు చార్జీలు రద్దు చేయాలని, రవాణా కోసం తగిన లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.
ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్, బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కర చారి, వైద రామానుజం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా అందాలి





- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం
- 75 రోజులు పూర్తి.. సజావుగా కొనసాగుతోంది : ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- సంక్షేమ, అభివృద్ధి పనులు సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్లు, ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి
- విద్య, వైద్య సేవలు మెరుగుపరచాలని సూచన

**కామారెడ్డి ప్రతినిధి, మే 22 (జనంసాక్షి):** కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఇప్పటివరకు వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర సమీక్ష జరిగింది. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా తీసుకొని పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా చేరే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కేవలం సమీక్ష సమావేశాలకు పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాల్లో కనిపించే మార్పుగా మారాలన్నారు.
ప్రతి శాఖకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించిందని, వాటి అమలులో వేగం పెంచాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, తాగునీరు, రోడ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని అన్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే జూన్ 2న జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు గృహప్రవేశాలు చేయనున్నట్లు, ఆయిల్ ఫామ్ పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, ప్రతి సంక్షేమ పథకం ప్రజల వద్దకు చేరాలని, అభివృద్ధిలో జిల్లాను ముందు వరసలో ఉండేలా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.
కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, ఎసీఎల్బీ గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి, ఎమ్మార్వో హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష

- అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి
- మరమగ్గాల పరిశ్రమకు ఆర్డర్ల కేటాయింపు
- జిల్లాలో వేగంగా అభివృద్ధి పనులు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 22 (జనంసాక్షి):** అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి సభను జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'జయ జయ హే తెలంగాణ' గీతాన్ని వినిపించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు.
జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పనులపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కింద మార్చి 6వ తేదీ నుంచి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పురోగతి, అవగాహన సదస్సులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, ఎంపీడీఓలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, వ్యవసాయ, ఉద్యానవన, మహిళా సంఘాలు, మత్స్య శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం, చైతన్యపరచడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 27 నెలలుగా ప్రజాపాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందుతోందని చెప్పారు.
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మొత్తం 99 రోజుల కార్యాచరణ కింద 10 థీమ్‌లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పూర్తిలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కింద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని, దీంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీఓలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ నాగేంద్రచారి, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'మీ సురక్ష - మీ భద్రతే మా ప్రాధాన్యత'

- ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఔట్‌లో పోలీసుల ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం
- మొబైల్ అప్లికేషన్‌లో రెంటర్లు, సెక్యూరిటీ గార్డుల వివరాలు
- కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచనున్నారు

**ఉప్పల్, మే 20 (జనంసాక్షి):** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఔట్‌లో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "మీ సురక్ష - మీ భద్రతే మా ప్రాధాన్యత" అనే నినాదంతో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ప్రస్తుతం నగర పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న నేరాలు, చోరీలు, ఆకతాయిల వేధింపులు, సైబర్ మోసాల నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో నివసించే ప్రతి కుటుంబం తమ పరిసరాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రెంటర్లు, గృహ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు మరియు ఇతర సేవా సిబ్బంది పూర్తి వివరాలను పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.
భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఏసీపీ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో ఆకతాయిల గుంపులు తిరగడం, బైక్ రైడర్లు అధిక వేగంతో హల్‌చల్ చేయడం, రోడ్లపై మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
ఈ సమస్యలపై స్పందించిన ఏసీపీ వెంకట్ రెడ్డి, కాలనీలో ప్రత్యేక పహారా బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి సమయంలో మరింత నిఘా పెంచుతామని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఐ రవికుమార్, ఉప్పల్ ఎస్సై మాధవ రెడ్డి, భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, మహిళలు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కాలనీవాసులు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలను అభినందించారు.

# కోతిరాంపూర్ డంపింగ్ యార్డ్‌పై ఐక్య ఉద్యమాలకు సిద్ధం

### ప్రజల ప్రాణాలకు ముప్పు: శాశ్వత పరిష్కారం కోరిన రాజకీయ పార్టీలు



**కరీంనగర్ టౌన్, మే 22, ( జనం సాక్షి ) :** నగరంలోని కోతిరాంపూర్ డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే దశల వారీగా ఐక్య ఉద్యమాలు చేపడతామని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, బీఆర్ఎస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల నాయకులు హెచ్చరించారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో డంపింగ్ యార్డ్ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుడికందుల సత్యం, జంగిలి ఐలేందర్ యాదవ్, జిందం ప్రసాద్, కొక్కిరాల సత్యారావు తదితరులు మాట్లాడుతూ, బీజేపీ నేతలు నగరంలో అధికారం వస్తే నెల రోజుల్లో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు ప్రజలను నిరాశపరిచారని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్‌పై ఉద్యమాలు చేస్తూ, కరీంనగర్ సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.
అలాగే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరూ కరీంనగర్‌కు చెందినవారే అయినప్పటికీ ప్రజల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.
ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకే స్మార్ట్ సిటీగా చెబుతున్నప్పటికీ నగరంలో దుర్వాసన, కాలుష్యం పెరిగిపోతున్నాయని అన్నారు. సుదూర ప్రాంతాల చెత్తను కూడా కోతిరాంపూర్ డంపింగ్ యార్డ్‌కు తరలించడం వల్ల పరిస్థితి మరింత విషమిస్తోందని విమర్శించారు. డంపింగ్ యార్డ్ తరలింపు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలో న్యాలపట్ల రాజు, టేకుమల్ల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బూడిద సదాశివ, బాకం ఆంజనేయులు, నాయిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం కీలక ప్రకటన

- జూన్ 2 నుంచి పంపిణీ.. 2 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు ముహూర్తం
- బీఆర్ఎస్ పాలనలో పెన్షన్లు మంజూరు చేయలేదని వేమారెడ్డి



**మోమిన్‌పేట, మే 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి తీపి కబురు అందించింది. జూన్ 2నుంచి 2 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేమారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా 2 లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు వంటి వర్గాలకు ఈ చేయూత పెన్షన్ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు మొదలైనవారికి నెలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 ఇస్తోంది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెన్షన్‌ను రూ.4,000కి పెంచుతామని హామీ ఇచ్చింది. అది ఇంకా అమలు కాలేదు. ఇప్పటివరకూ పెన్షన్ పొందకుండా, కొత్తగా పెన్షన్ పొందాలనుకునేవారు గ్రామ సభలు, ప్రజా వాణి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు లు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్స వం వేళ కొత్త కార్డుల మంజూరు ప్రారంభించాలని నిర్ణయించారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డుల ఆమోద ప్రక్రియ నిరంతరం కొనసాగించేందుకు ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, వేగవంతంగా దిగుమతులు చేయించేందు కు అధికారులు, మిల్లర్లను సమన్వయం చేస్తూ చర్యలు చేపట్టిం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా పూర్తయి గృహ ప్రవేశాలు అవుతున్నాయని వివరించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ జూన్‌లో ప్రారంభవుతుందని తెలిపారు.



# సిరికొండలో పామాయిల్ తోట దగ్ధం

**కథలాపూర్, మే 22 (జనం సాక్షి)**
కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలోని రైతు అల్గొట్ ప్రమోద్ కు సంబంధించిన ఎకరంనరా పామాయిలు తోట మరియు దానికి సంబంధించిన డ్రిప్ సిస్టమ్ ప్రమాదవసత్తు పూర్తిగా దగ్ధం అయిందని రైతులు తెలిపారు.రైతు ప్రమోద్ నాలుగు సంవత్సరాలుగా కష్టపడగా చేతుకు అందిన పంట కాలి భూడిది అవ్వడంతో రైతు కన్నీటి పర్వంతం అయ్యాడు ప్రభుత్వం ఆదుకోవాలని రైతు అల్గొట్ ప్రమోద్ వేడుకున్నాడు.

# ఈత సరదా.. ఇద్దరి ప్రాణాలు బలి

### మానేరు వాగులో ఇంటర్ విద్యార్థుల మృతి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 22 (జనం సాక్షి);** ఈత సరదా ఇద్దరు యువకుల ప్రాణాలను బలితీసుకుంది. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు చెందిన ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మానేరు వాగులో మునిగి మృతిచెందిన ఘటన శుక్రవారం విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన ఎదురుగట్ల హరిచరణ్(18), వేములవాడ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన అల్లం మణికంఠ(17) తమ స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం తంగళ్ళపల్లి మండలం గోపాల్‌రావుపల్లి గ్రామ శివారులోని మానేరు వాగుకు స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. స్నేహితులు, స్థానికులు గమనించి వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే వారు మృతిచెందినట్లు తెలిసింది. మృతులు ఇద్దరూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం. ఘటనపై హరిచరణ్ తండ్రి ఎదురుగట్ల చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

# కరీంనగర్ అభివృద్ధికి రూ.840 కోట్ల భారీ నిధులు

- మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, డ్రైనేజీ పనులకు భారీ కేటాయింపు
- స్మార్ట్ సిటీ మిగిలిన 70 కోట్లు కూడా మంజూరు
- ప్రధాని మోదీ, బండి సంజయ్‌కు మేయర్ ధన్యవాదాలు




**కరీంనగర్ బ్యూరో, మే 22 (జనంసాక్షి):** కరీంనగర్ నగర చరిత్రలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్ నగర అభివృద్ధికి రూ.840 కోట్ల భారీ నిధులను ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, హైదరాబాద్ తర్వాత ఆధునిక సౌకర్యాలతో వేగంగా అభివృద్ధి చెందే నగరంగా కరీంనగర్ నిలవబోతుందని పేర్కొన్నారు. మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, జంక్షన్ అభివృద్ధి పనుల కోసం రూ.630 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగర ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలను ఇబ్బంది పెట్టే ముంపు సమస్యలను నివారించేందుకు డ్రెయిన్ల పునరుద్ధరణ, వరద నియంత్రణ పనుల కోసం రూ.130 కోట్లు కేటాయించారని వెల్లడించారు. అలాగే నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కోసం రూ.80 కోట్లు ఆమోదించబడినట్లు తెలిపారు. తొలుత యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ లేకపోయినా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పట్టుదల వల్లే ఈ నిధులు సాధ్యమయ్యాయని మేయర్ పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి పై ఆయనకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నగర ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం

- 75 రోజులు పూర్తి.. సజావుగా కొనసాగుతోంది
- సంక్షేమ, అభివృద్ధి పనులు సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్లు, ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి
- విద్య, వైద్య సేవలు మెరుగుపరచాలని సూచన



**కామారెడ్డి, మే 22 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ఇప్పటికే 75 రోజులు పూర్తయ్యాయని, కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.
జిల్లా స్థాయి ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం "జయ జయ హే తెలంగాణ" గీతంతో కార్యక్రమం ముందుకు సాగింది.
ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.
ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం వేదికగా నిలుస్తోందని తెలిపారు.
జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతం గా ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమన్నారు. రాబోయే జూన్ 2న జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు గృహప్రవేశాలు చేయనున్నట్లు, ఆయిల్ ఫామ్ పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, ప్రతి సంక్షేమ పథకం ప్రజల వద్దకు చేరాలని, అభివృద్ధిలో జిల్లాను ముందు వరసలో ఉండేలా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, ఎసీఎల్బీ గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి, ఎమ్మార్వో హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ మార్కెట్‌లో ప్రమాదకరమైన 'రెడ్ జోన్'




**న్యూఢిల్లీ, మే22 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ ఆయిల్ మార్కెట్ త్వరలో తీవ్ర ప్రమాదకరమైన 'రెడ్ జోన్'లోకి ప్రవేశిస్తుందని ఇంటర్‌నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్ కారణంగా క్రూడ్ ఆయిల్ సప్లై స్తంభించి.. ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఆయిల్ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్ కొరత ఏర్పడ్డ సంగతి తెలిసిందే. రోజు రోజుకు సమస్య తీవ్రతరం అవుతోంది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆయిల్, గ్యాస్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అంతేకాదు.. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం నౌకలు ఆయిల్, గ్యాస్ రవాణా చేసే హోర్ముజ్ జలసంధి కూడా మూతపడింది. అమెరికా-ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూత పడటం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ప్రతీరోజూ 13 నుంచి 14 మిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్ సప్లై నిలిచిపోయిందని ఇంటర్ నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ తెలిపారు. హోర్ముజ్‌ను మళ్లీ తెరవకపోవటం.. నౌకలు ప్రయాణించడానికి ప్రత్యామ్నాయ దారులు లేకపోవటంతో సప్లై మరింత దారుణంగా పడిపోయిందని బిరోల్ అన్నారు. సప్లై నిలిచిపోవటం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి నెలలో ఐఈఏ, 32 సభ్య దేశాలు కలిసి మార్కెట్లోకి విడుదల చేసిన రికార్డు స్థాయి 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు కూడా పూర్తిగా హరించుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

# అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టండి

- లీకేజీలను అరికట్టి, బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి
- రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ఆర్థిక పురోగతిని పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన 'రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' (ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం) ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ కీలక భేటీకి కమిటీ సభ్యులైన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో కలిసి లోతుగా సమీక్షించింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించనున్న బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా నిర్దేశించుకున్న టైమ్ లైన్ (క్యాలెండర్) ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. అనివార్య కారణాలవల్ల ఈ సమావేశానికి రానటువంటి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు.. మే 28 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సవరించిన (పెంచిన) భూముల మార్కెట్ విలువలు (రిజిస్ట్రేషన్ ధరలు) అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశంలో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన 'హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్' సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ , హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశం చేసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రెవిన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ వ్యవసాయ రునాలకే పరిమితం కారాదు
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన




**హైదరాబాద్, మే22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్ధక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

## మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెటిఆర్
- బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్, మే22 (జనంసాక్షి) :** మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలం గాణ ప్రజలు భావిస్తు న్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం

**జయశంకర్ భూపాలపల్లి, మే22 (జనంసాక్షి) :** చిట్యాల మండలం రామచంద్రాపురంలో అగ్ని ప్రమాదం సంభవించింది. 11కెవి విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోటలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి పంట మొత్తం దగ్ధమైంది. అగ్ని ప్రమాదం రైతు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ?సిరిపురం కుమారస్వామి అనే రైతుకు చెందిన 4 ఎకరాల అరటి తోట అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చేతికి వచ్చే దశలో ఉన్న పంట కాలిపోవడంతో రైతు కన్నీరుమున్నీ రవుతున్న పరిస్థితి. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

## అర్చక తండ్రీ కుమారుల ఆత్మహత్య

**జనగామ, మే 22 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అర్చకులుగా పనిచేస్తున్న తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నారు. గణపురం మండలం బండగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహించే వరయోరు లక్ష్మీనరసింహాచార్యులు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆలయ కోనేరులో పడి మృతిచెందినట్లు చెప్పారు. లక్ష్మీనరసింహాచార్యుల భార్య శ్రీదేవి నెల క్రితం అనారోగ్యంతో చనిపోవడం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కోట్లల్లో డిప్యూటీ కలెక్టర్ ఆస్తులు

అక్రమ ఆస్తులపై ఏసీబీ సోదాలు



**హైదరాబాద్, మే 22 (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకి సంబంధించిన 8 ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో వంశీ మోహన్‌కు సంబంధించి.. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అధికారులు నమోదు చేశారు. పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులు కాజేసినట్లు వంశీ మోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్ ఆర్డీవోగా పనిచేశారు. అలాగే అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాల భూమిని ఆయన కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి.. దానిని రియల్టర్‌కు కట్టబెట్టినట్లు విమర్శలు వచ్చాయి. ఒక ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్‌ను వంశీ మోహన్ తీసుకున్నట్లు కూడా ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో వంశీ మోహన్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

## మక్కరైతుల బొక్కబోర్లా

### కొనుగోళ్లు లేక నానా తంటాలు



**నిజామాబాద్, మే22 (జనంసాక్షి) :** నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మక్కలు, జొన్న రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరగాల్సిన కొనుగోళ్లు ముందుకు కదలడం లేదు. అనుమతులు రాకపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియనే చేపట్టలేదు. మే 20 నుంచి జొన్న కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే మార్కెట్ యార్డుల్లో నెలల తరబడి పంట ఉత్పత్తులతో రైతులు పడిగాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగానే చేరింది. కొనుగోళ్లు తూతూ మంత్రంగా చేపట్టి చేతులు ఎత్తేశారు. రూ.2400 కనీస మద్ధతు ధర అన్నది ఎక్కడా అమలు కావడం లేదు. మక్క రైతులు బాధలకు ప్రభుత్వం స్పందించడం లేదు. మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం చేతులు ఎత్తేసినట్లే కనిపిస్తోంది. కొనుగోళ్ల విషయంపై మౌనం పాటిస్తోంది. ప్రైవేటు కొనుగోళ్లు మినహాయించగా 8లక్షల 65వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 6లక్షల 29వేల 915 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 739 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.అన్ని చోట్ల కేంద్రాలను తెరిచారు. ప్రస్తుతం 653 చోట్ల కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 86 చోట్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 11వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3లక్షల 14వేల 589 మెట్రిక్ టన్నులు సేకరించారు. 42వేల 225 మంది రైతుల నుంచి రూ.751.55 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 329 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్నాయి. 67 చోట్ల కొనుగోళ్లు పూర్తి కావడంతో మూసేశారు. ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్ప కొనుగోళ్లు జరగక రైతులు కల్లాలవద్దనే పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తూకం వేసి మూడు రోజులైనా, లారీలు వస్తలేవని సంచులు తీసుకుని పోవడం లేదు. తూకం వేసిన బస్తాలు ఎండల్లోనే ఎండిపోతున్నాయి. డ్రైవర్లకు రూ.2 ఇస్తేనే లారీలు వస్తాయని చెబితే దానికీ ఒప్పుకున్న రైతులు అందుకు కూడా సరే అంటున్నారు.. అయినా లారీలు వస్తలేవని అంటున్నారు.

# గల్ఫ్‌లోని తెలంగాణ బిడ్డల ఓట్లు పోకుండా చూస్తాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తాం
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో పార్టీ సమీక్ష సమావేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. త్వరలో రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఓటర్ల ఓట్ల జాబితా సవరణ కోసం ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన విషయంలో లక్షలాది మంది తెలంగాణ ఎన్ఆర్ఐల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నదని కేటీఆర్ అన్నారు. ఈ విషయంలో గల్ఫ్ బాట పట్టిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కులు తొలగించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని పార్టీ తరఫున కలుస్తామని తెలిపారు. ఈరోజు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి గారి నివాసంలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ సమావేశంలో సీనియర్ నేతలతో కూడిన సమీక్షా సమావేశంలో కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే వందలాది మంది ఎన్ఆర్ఐలు తమ స్థానిక శాసన సభ్యులకు, మాజీ శాసన సభ్యులకు ఫోన్లు చేసి ఆందోళన చెందుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్ ఈ విషయంలో జాతీయ ఎన్నికల సంఘాన్ని కలిసి తెలంగాణ ఎన్నారైల ఓటు హక్కును కాపాడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఇందుకు సంబంధించి పార్టీ తరఫున ఒక సీనియర్ ప్రతినిధి, నాయకుల ప్రతినిధి బృందాన్ని, ఎమ్మెల్యేలు, ఎంపీల బృందాన్ని ఢిల్లీకి పంపనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఢిల్లీకి పంపనున్నట్లు తెలిపారు, దీంతోపాటు స్థానికంగా కూడా పార్టీ తరఫున ఎస్ఐఆర్ కోసం నియమించిన బూత్ లెవెల్ అసిస్టెంట్ల ద్వారా గల్ఫ్‌లోని తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు సహాయ సహకారాలు అందిస్తామని కేటీఆర్ తెలిపారు. తమకు కేటాయించిన బూత్ల పరిధిలో గల్ఫ్ ఎన్ఆర్ఐల వివరాలు సేకరించి వారి ఓటు హక్కును ఎలక్షన్ కమిషన్ తొలగించకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, నియోజ కవర్గ ఇన్చార్జు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. దీంతోపాటు పార్టీ తరఫున ఎస్ఐఆర్ కోసం నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లతో కూడా సమన్వయం చేసుకోవాలని సూచిం చారు. శుక్రవారం జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణను కేటీఆర్ నేతలకు వివరించారు. పార్టీ పెట్టిన తొలినాళ్లలోనే జిల్లా పరిషత్తు గెలుచుకొని భారత రాష్ట్ర సమితికి ఆది నుంచి నిజామాబాద్ జిల్లా ఒక బలమైన కోటగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక అవకాశంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. కేసీఆర్ సూచించినట్లు సభ్యత్వ నమోదును కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, దీంతోపాటు ఎస్ఐఆర్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని కూడా పకడ్బందీగా నిర్వహించి ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కు తొలగించకుండా చూడాలని సూచించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నేతలంతా తమ స్థానిక నియోజకవర్గాల్లో ఉన్న స్థితిగతులపైన కేటీఆర్‌కు వివరాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరి స్తున్న విధానాల వలన, చేస్తున్న మోసాల వలన అనేక వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, తిరిగి కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని నేతలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, రానున్న ఎన్నికల నాటికి తిరిగి జిల్లాలో భారత రాష్ట్ర సమితి పూర్తిగా స్వీప్ చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని నేతలు తెలిపారు. ఈ సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జు, పార్టీ సీనియర్ నేత సురేష్ రెడ్డితో పాటు జిల్లా సభ్యత్వ నమోదు ఇన్చార్జ నియమితులైన వి.జి. గౌడ్, జనరల్ సెక్రటరీ కూడా ఉన్నారు.

## ఎంబీబీఎస్ చదువుతున్న గౌరీకి భరోసా!



కొల్లాపూర్ నియోజకవర్గం, వీపనగండ్ల మండలం, కల్వరాల గ్రామానికి చెందిన బొరెల్లి నర్సింహా కుమార్తె బొరెల్లి గౌరి పటాన్‌చెరు మహేశ్వరం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. వారి కుటుం బ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఫీజులు చెల్లించడం, అమ్మాయిని చదివించడం కష్టసాధ్యంగా ఉన్నది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా తెలుసు కున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్టోబర్ 2024లో మొదటి సంవత్సరం ఫీజును చెల్లించారు. శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో రెండో సంవత్సరానికి సంబంధించిన రూ.1.30 లక్షల ఫీజు చెక్కును విద్యార్థినికి కేటీఆర్ అందజేశారు. గౌరి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుమార్తె చదువు కొనసాగేందుకు అండగా నిలిచిన కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370